# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం-07-నవంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 159 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## రెవంత్ రెడ్డి ని కలిసిన రామోజీ గ్రూప్ చైర్మన్

- రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు వివరాలు సీఎం సమీక్ష
- సమాజం, మీడియా, విద్యారంగాల్లో రామోజీ గ్రూప్ సేవలకు సీఎం ప్రశంసలు
- వేడుకల ఏర్పాట్లు, ముఖ్యాంశాలపై చర్చ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి ని రామోజీ గ్రూప్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ నెల 16న జరగనున్న 'రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే' వేడుకల సందర్భంగా నిర్వహించే

మిగతా 2లో

## ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న సజ్జనార్

**హైదరాబాద్ సిటీ పోలీసు బృందంతో సాధన**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ సిటీ పోలీసు బృందంతో కలిసి ఫైరింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొన్నట్లు వీ.సీ. సజ్జనార్, ఐపీఎస్ తెలిపారు. టీజీపీఏ (తెలంగాణ పోలీస్ అకాడమీ)లో జరిగిన ప్రాక్టీస్‌లో పాల్గొనడం ఎప్పుడూ ఉత్సాహాన్ని స్తుందని, మళ్లీ షూటింగ్ రేంజ్‌కు వెళ్లి బుల్స్‌ఐను హిట్

మిగతా 2లో



## సెంటిమెంట్ అన్నిసార్లూ పనిచేయదు

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌పై మంత్రి కోమటిరెడ్డి విమర్శలు**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సెంటిమెంట్ రాజకీయాలు అన్ని సమయాల్లో పనిచేయవని, ప్రజలు అభివృద్ధి, పాలనను పరిశీలించి ఓటు వేస్తారని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లో 30 నుంచి 50 వేల ఓట్ల భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుపు ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. ప్రచార సభలో మాట్లాడిన కోమటిరెడ్డి, దివంగత నేత పీజేఆర్ కుటుంబానికి బీఆర్ఎస్ చూపించిన వ్యవహారశైలిని ఎత్తిచూపారు. "పీజేఆర్ చనిపోయినప్పుడు, ఆయన భార్యకు అపాయింట్‌మెంట్ ఇవ్వడానికి మూడు గంటలు పట్టింది.

మిగతా 2లో

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ హైప్

**నవీన్ యాదవ్ విజయం కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటింటి ప్రచారం**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేడెక్కుతున్న వేళ, కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి ఊపు తెచ్చేందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ యూసుఫ్‌గూడ డివిజన్‌లో విస్తృతంగా డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణ నగర్ ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరిస్తూ వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. జనం నుంచి వచ్చిన స్పందన ఉత్సాహాన్నిచ్చిందని వెల్లడించారు. ప్రచారంలో భాగంగా పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

మిగతా 2లో







## అనుమతిని రద్దు చేశారని బండి సంజయ్ విమర్శలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కేంద్ర గృహ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుకున్న బోరబండ మహాసభకు అనుమతిని తొలుగా ఇచ్చి మధ్యాహ్నం 1 గంటకు అకస్మాత్తుగా రద్దు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇది ప్రజాస్వామ్యమేనా లేదా రజాకార్ విధానం అంటూ ప్రశ్నించారు. బండి సంజయ్ ఆరోపణల ప్రకారం పోలీసులను ఏఐఎమ్ఐఎమ్ ఆదేశాల్లో హస్తకంపాలయ్యాయన్నారు. ప్రజల విజ్ఞప్తిని లేదుగా, బీజేపీ పెరుగుదల వల్ల భయపడుతున్నారా అని ప్రభుత్వం ప్రశ్నించాలని కోరారు. అనుమతికి సంబంధించి విచిత్ర మార్పు జరగడంతో తక్షణ కారణాల గురించి అధికారుల వివరణ కోరారు. అనుమతి లేకపోయినా శాంతిపూర్వకంగా బోరబండ వచ్చి మాట్లాడే నిర్ణయం తీసుకున్నట్లు బండి సంజయ్ వెల్లడించారు.

మిగతా 2లో

## జూబ్లీహిల్స్‌లో ఓటర్ల మనసు చదవలేక సర్వేలు



- గెలుపెవరిదో సర్వేలు చెప్పలేకపోతున్నాయి
- జూబ్లీహిల్స్‌పై కిషన్ రెడ్డి ఆసక్తికర విశ్లేషణ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఏ పార్టీ గెలుస్తుందనే విషయంలో సర్వేలు కూడా స్పష్టత ఇవ్వలేకపోవడం ఆసక్తికర పరిణామమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారం చివరి దశలో ఉన్నప్పటికీ ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతున్నారనే దానిపై తీవ్ర గందరగోళం నెలకొన్నట్లు

మిగతా 2లో



## తెలంగాణ నీటి భవిష్యత్తుకు సాంకేతిక అస్త్రం

- సిఎం రేవంత్ ప్రారంభించిన ఏరియల్ జియోఫిజికల్ సర్వే
- ఎస్ఎల్‌బిసి టన్నెల్ నిర్మాణానికి 'వీటిఈఎం ప్లస్'తో శాస్త్రీయ పరిశీలన

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నీటి వనరుల భద్రత, సాగునీటి సరఫరా కోసం అత్యాధునిక సాంకేతికత వినియోగానికి శ్రీకారం చుట్టారు. ఆంధ్రప్రదేశ్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ పరిధిలోని శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కాలువ టన్నెల్ నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి, రక్షించడానికి ఆధునిక ఏరియల్ జియోఫిజికల్ సర్వేను ప్రారంభించారు. ఈ సాంకేతిక సర్వే ద్వారా నేల లోపలి భూగర్భ నిర్మాణాలను అత్యంత ఖచ్చితత్వంతో మ్యాప్ చేయనున్నారు.

మిగతా 2లో

## తన్నీరు సత్యనారాయణ రావు దశదినకర్మలో పాల్గొన్న కేటీఆర్

**పుష్పాంజలి ఘటించి నివాళి**

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి దివంగత తన్నీరు సత్యనారాయణ రావు దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ రావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కేటీఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సత్యనారాయణ రావు సేవలు, విలువలు, క్రమశిక్షణ హరీష్ రావు ప్రజా సేవలో ప్రతిఫలిస్తున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కార్యక్రమానికి పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.



## ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న నల్గొండ రైల్వే స్టేషన్

**80 శాతం పనులు పూర్తయ్యాయి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

నల్గొండ, (తెలంగాణ ముచ్చట్లు)

అమృత్ భారత్ పథకంలో భాగంగా తెలంగాణలో ఆధునిక సౌకర్యాలతో పునరాభివృద్ధి జరుగుతున్న 40 రైల్వే స్టేషన్లలో నల్గొండ రైల్వే స్టేషన్ ఒకటిగా నిలుస్తోంది. ఈ ప్రాజెక్టు పురోగతిని గురించి కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సోషల్ మీడియాలో వివరించారు. సుమారు ₹17 కోట్ల వ్యయంతో పునర్నిర్మాణం జరుగుతున్న నల్గొండ రైల్వే స్టేషన్‌లో 80 శాతం పనులు పూర్తయ్యాయి. స్టేషన్‌ను ప్రయాణికులకు మరింత సౌకర్యవంతంగా, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు.

మిగతా 2లో



## గౌడ్ సమాజ సబలీకరణ లక్ష్యంగా హైదరాబాద్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆత్మీయ సమ్మేళనం

- మోతీనగర్‌లో గౌడ్ సామాజిక ఆత్మీయ సమ్మేళనం ఘనంగా
- సమాజ ప్రాతినిధ్యం పెంపుకు బీజేపీ కృషి
- గౌడ్ వర్గం రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర: నాగం రాంచందర్ రావు
- ప్రత్యేక పథకాలతో వర్గ శ్రేయస్సుకు హామీ
- ఐక్యతతో ముందుకు సాగి శక్తివంతమైన నాయకత్వం సాధించాలని పిలుపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గౌడ్ సామాజిక ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గౌడ్ సమాజానికి రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు, సమాజాన్ని పార్టీతో అనుసంధానించేందుకు

మిగతా 2లో



శుక్రవారం-07- నవంబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : పొట్లపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ హైప్

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుత ప్రజా పాలన ప్రభుత్వం ప్రజల కోసం అమలు చేస్తున్న పలు కీలక సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి, వాటిని కొనసాగించేందుకు కాంగ్రెస్‌కు మరోసారి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ప్రజల కోసం చేసేది, మాట ఇచ్చి నిలబెట్టేది కాంగ్రెస్ మాత్రమే" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళలు, యువకులు, వృద్ధుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, పలు నిబంధనలను ఎంచక్కా వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఒక్కొక్కరికి 6 కిలోల సన్నబియ్యం కుటుంబాలకు అందజేస్తోందని గుర్తుచేశారు. అదేవిధంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ ₹500కి, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, అలాగే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాల వివరాలు మహిళలకు, వృద్ధులకు ప్రత్యేకంగా తెలిపారు.



ప్రచారం సందర్భంగా స్థానిక ప్రజల నుంచి వచ్చిన స్పందన కాంగ్రెస్‌కు అనుకూలంగా కనిపించింది. ప్రాంత ప్రజలు తమ సమస్యలను పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సమస్యలపై కూడా చర్చ జరిగింది. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు పార్టీ తరఫున తక్షణ చర్యల కోసం హామీ ఇచ్చారు. తరువాత కాపు సంఘ నాయకుల నివాసంలో అల్పాహార సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాపు సంఘాల ప్రతినిధులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు ఏకగ్రీవ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం సంఘం నుండి ప్రతి ఇంటికీ ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. నవీన్ యాదవ్ విజయమే జూబ్లీహిల్స్ అభివృద్ధికి పునాది అవుతుందని వారు పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం క్రమంగా ముమ్మరమవుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని ప్రముఖ నాయకులు ప్రజల్లో పాల్గొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి.



## రేవంత్ రెడ్డి ని కలిసిన రామోజీ గ్రూప్ చైర్మన్

(మొదటి పేజీ తరువాయి)

"రామోజీ ఎక్సలెన్స్ అవార్డులు" ప్రదానోత్సవానికి ముఖ్యమంత్రిని ప్రత్యేక అతిథిగా రావాలని కోరారు. సీఎంని ప్రగతిభవన్‌లో కలిసి వేడుకల ఏర్పాట్లు, కార్యక్రమ ప్రధానాంశాల గురించి కిరణ్ వివరించారు. రామోజీ గ్రూప్ సమాజం, మీడియా, విద్య, సేవారంగాల్లో చేస్తున్న సేవలను సీఎం అభినందించినట్లు సమాచారం.

# సెంటిమెంట్ అన్నిసార్లూ పనిచేయదు

(మొదటి పేజీ తరువాయి)

అప్పుడు వారి సెంటిమెంట్ ఏమైంది? నిజంగా సెంటిమెంట్ పనిచేస్తే కంటోన్మెంట్ ఉప ఎన్నికలోనే బీఆర్ఎస్ గెలిచి ఉండేది" అంటూ వ్యాఖ్యానించారు. ఇప్పుడు బీఆర్ఎస్ సెంటిమెంట్ కార్డు ఆడినా, ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. కాంగ్రెస్ పాలనకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. జూబ్లీహిల్స్‌లో కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటున్నారని, "మా ఓటు కాంగ్రెస్‌కే'' అని స్పష్టంగా చెబుతున్నారని తెలిపారు. "ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 20 వేల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశాం. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిన ఈ ప్రక్రియ ఎన్నికల తర్వాత వెంటనే పునఃప్రారంభిస్తాం. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు అందిస్తాం" అని హామీ ఇచ్చారు. కొంత మంది నేతలు 'కారు కావాలా? బుల్డోజర్ కావాలా?' అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారని ఎద్దేవా చేసిన కోమటిరెడ్డి, "ఇక్కడ కారు గుర్తుకే దిక్కులేదు" అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ను రౌడీ షీటర్ అంటున్నారనే విమర్శలపై ఆయన స్పందిస్తూ, "దమ్ముంటే కేటీఆర్ ఒక్క ఎఫ్ఐఆర్ అయినా బయటపెట్టాలి" అని సవాల్ విసిరారు. ప్రజల మద్దతుతో కాంగ్రెస్ ఘన విజయం సాధించబోతుందని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేస్తుందని కోమటిరెడ్డి పునరుద్ఘాటించారు.





## ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న సజ్జనార్

(మొదటి పేజీ తరువాయి)

చేయడం థ్రిల్లింగ్‌గా అనిపించిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. సజ్జనార్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా పోలీసు దళాల్లో ఆయుధ వినియోగ నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణలో నిరంతర సాధన ప్రాధాన్యతను మరొకసారి రుజువు చేసినట్లుగా పోలీసులు అభిప్రాయపడ్డారు.



## అనుమతిని రద్దు చేశారని బండి సంజయ్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

"నన్ను హఠాత్తుగా ఆపగలరా? బీజేపీ పెద్ద యుద్ధాలను తెలివిగా ఎదుర్కొంది, నేనూ సరే" అని పోస్టులో పేర్కొన్నారు. ఆయన బీజేపీ కార్యకర్తలను ఈ సాయంత్రం పూర్తి బలంతో బోరబండ చేరలి అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా స్థానిక పోలీసులు, నిర్వాహకుల నుంచి అధికారిక వ్యాఖ్య లేదు. ఎన్నికా ఉపక్రమాల నేపథ్యంలో అనుమతుల విషయంలో వచ్చే వివాదాలు కొనసాగే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## తెలంగాణ నీటి భవిష్యత్తుకు సాంకేతిక అస్త్రం

(మొదటి పేజీ తరువాయి)

టన్నెల్ నిర్మాణ మార్గంలో ఉన్న బలహీన ప్రాంతాలు, రాళ్ల నిర్మాణం, నీటి గుదిబండలు, భూగర్భ రంధ్రాలను ముందుగానే గుర్తించి ఇంజినీరింగ్ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం లక్ష్యంగా ఉంది. దీతో టన్నెల్ నిర్మాణం సురక్షితంగా, వేగంగా కొనసాగే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. తెలంగాణకు జీవనాడిగా భావించే ఈ సాగునీటి ప్రాజెక్టను 2028 మధ్య నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పూర్తి అయితే నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాలలో సాగు, తాగునీటి అవసరాలకు భారీ ఉపశమనం లభించనుంది.

తెలంగాణ భవిష్యత్తు జల భద్రత కోసం శాస్త్ర సాంకేతికత వినియోగం కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. నీటి వనరుల అభివృద్ధిలో నూతన ఆవిష్కరణలు, జియోసైన్స్ టెక్నాలజీ వినియోగంతో టన్నెల్‌ను దేశానికి మోడల్ ప్రాజెక్ట్‌గా మార్చే దిశగా చర్యలు ప్రారంభమైనట్లు అధికార వర్గాలు వ్యాఖ్యానించాయి.



# జూబ్లీహిల్స్‌లో ఓటర్ల మనసు చదవలేక సర్వేలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడిచినా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి మరియు మంత్రులు తమ హామీలను ప్రస్తావించకపోవడం ప్రశ్నార్థకమని పేర్కొన్నారు. "ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారంటీలు ఎక్కడ? ప్రజల ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా ఉచిత బస్సు ప్రయాణం గురించి మాత్రమే చెప్పడం ఏమిటి? అన్ని సమస్యలకు అది ఒకే పరిష్కారమా?" అంటూ విమర్శించారు. సర్కారు పంపిణీ చేస్తున్న సన్నబియ్యంలో అధిక భాగస్వామ్యం కేంద్రానిదేనని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. "అంతలోనే సీఎం ఆ పథకాన్ని ఆపేస్తామని చెప్పడం ఎలా? ప్రజలను గందరగోళానికి గురిచేయడం సరైంది కాదు" అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెనుకబాటుకు గతంలో పాలించిన బీఆర్ఎస్ కూడా సమాన బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. "గ్రామాల్లో కనీసం ఉండే అభివృద్ధి కూడా ఇక్కడ కనిపించదు. జీహెచ్ఎంసీ ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉంది. వీధి దీపాలు పెట్టేందుకు కూడా నిధుల్లేని పరిస్థితి" అని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితమైందని గుర్తుచేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, బీఆర్ఎస్‌పై నమ్మకం లేకపోవడం వల్ల జూబ్లీహిల్స్ ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో ఇంకా నిర్ణయించుకోలేకపోతున్నారని కిషన్ రెడ్డి విశ్లేషించారు. ఈ అస్పష్టత, గందరగోళమే సర్వేల్లో కూడా ప్రతిబింబిస్తోందని వ్యాఖ్యానించారు.



# గౌడ్ సమాజ సబలీకరణ లక్ష్యంగా హైదరాబాద్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా ఆత్మీయ సమ్మేళనం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సమ్మేళనానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగం రాంచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్న వారికి ఉద్దేశించి మాట్లాడారు. గౌడ్ సమాజం శ్రమజీవి వర్గమని, రాష్ట్ర అభివృద్ధిలో ఈ వర్గం పాత్ర విశేషమని పేర్కొన్నారు. నాయకులు మాట్లాడుతూ, గౌడ్ సమాజ అభివృద్ధికి బీజేపీ కృతనిశ్చయంతో పనిచేస్తుందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వర్గానికి ప్రత్యేక పథకాలతో శ్రేయస్సు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు సమాజ ప్రముఖులు గౌడ్ వర్గానికి ప్రభుత్వ, రాజకీయ వ్యవస్థల్లో తగిన ప్రాధాన్యం దక్కాలని అభిప్రాయపడ్డారు. ఓటు హక్కును వినియోగించే సమయంలో సంక్షేమం, అభివృద్ధి, విద్యావకాశాలు, ఉపాధి సృష్టి వంటి అంశాలను ప్రాధాన్యంగా చూడాలని సూచించారు. సమ్మేళనం ముగింపు సందర్భంగా సమాజాన్ని ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఐక్యతతో ముందుకు సాగితేనే శక్తివంతమైన నాయకత్వాన్ని తయారు చేయగలమని పార్టీ నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎల్.డి. రావు, అదిలాబాద్ ఎమ్మెల్యే మరియు శాసనసభాపక్ష ఉపనేత పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వి.జీ, మాజీ ఎంపీ మరియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సయ్య గూడ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనందగౌడ్ పాల్గొన్నారు.



## ఆధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న నల్గొండ రైల్వే స్టేషన్

(మొదటి పేజీ తరువాయి)

పునరాభివృద్ధి పనుల్లో విస్తృతంగా అప్‌గ్రేడ్‌లు చేపడుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల రద్దీ, భద్రత, సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని ప్లాట్‌ఫారంల విస్తరణ, ఆధునిక వేటింగ్ హాల్స్, డిజిటల్ డిస్‌ప్లేలు, లిఫ్టులు, ర్యాంపులు, పార్కింగ్ సదుపాయాల మెరుగుదల, పచ్చదనం పెంపుదల వంటి పనులు జరుగుతున్నట్లు సమాచారం. పనులు పూర్తయ్యాక నల్గొండ రైల్వే స్టేషన్ ప్రయాణికులకు ప్రపంచ స్థాయి అనుభవం అందించేలా రూపుదిద్దుకోనుందని కిషన్ రెడ్డి తెలిపారు.






# బీసీ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ జరగాల్సిందే

- బీసీ రిజర్వేషన్లపై పోరాటాన్ని పల్లె పల్లెకు విస్తరిస్తాం.
- హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసి ఆధ్వర్యంలో మౌన దీక్ష.

ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్.

**హసన్ పర్తి, నవంబర్ 06(తెలంగాణ ముచ్చట్లు):** జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు విద్యా,ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాలో 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వెంటనే రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం హన్మకొండలో అంబేద్కర్ జంక్షన్ దగ్గర అంబేద్కర్ విగ్రహం వద్ద విగ్రహం వద్ద బీసీ జేఏసీ నాయకులు మౌన దీక్ష చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జనాభాలో 10 శాతం ఉన్న అగ్రవర్ణాలు రాజకీయ అధికారాన్ని చేజిక్కించుకొని, అన్ని రంగాలను శాశిస్తూ, బీసీలను అణగదొక్కుతున్నారని మండిపడ్డారు.జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలు మాత్రం అగ్రవర్ణ పార్టీల జెండాలు మోసే కార్యకర్తలుగాను,ఓట్లు వేసే యంత్రాలుగాను మిగిలిపోతున్నారన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ,రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడితే,మద్దతునిచ్చిన బిజెపి,బీఆర్ఎస్ పార్టీలు రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ,బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలని,లేకుంటే బీసీ ఉద్యమాన్ని పల్లే పల్లేకు విస్తరించి బిజెపికి తగిన గుణపాఠం చెప్తామన్నారు. దేశంలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వచ్చిన తర్వాత రిజర్వేషన్లు లేని వర్గం అంటూ ఏదీ లేదన్నారు. దగాపడ్డ బీసీలు దండు కట్టే సమయం ఆసన్నమైందన్నారు.తెలంగాణ ఉద్యమ తరహాలోనే బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్ళనున్నట్లు వేణుగోపాల్ గౌడ్ వెల్లడించారు. డిసెంబర్ మొదటి వారంలో బీసీల చలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి చేపడతామని, జనవరి 4వ వారంలో లక్ష మందితో వేల వృత్తులు,కోట్ల గొంతులు అనే నినాదంతో హైదరాబాదులో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు .ఈ కార్యక్రమంనికి లంబాడి హక్కుల పోరాట సమతి,ఎమ్మార్పీఎస్ మద్దత్తు తెలిపారు.ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా బీసీ జేఏసీ చైర్మన్ దాడి మల్లయ్య యాదవ్,బోనగాని యాదగిరి గౌడ్,బీసీ జేఏసీ మహిళా నాయకురాలు తమ్మెలా శోభరాణి,మాదం పద్మజదేవి,తెల్ల సుగుణ,హైమావతి,కిషోర్ బీసీ జేఏసీ జిల్లా నాయకులు బచ్చు ఆనందం,దాడి రమేష్ యాదవ్,గొట్టె మహేందర్,డా. ఒడితల రాము, తంగళ్లపెల్లి రమేష్, పంజల మధు గౌడ్,జ్ఞానేశ్వర్, రజనీకాంత్,పొన్నం సంపత్,చాగంటి రమేష్ పాల్గొన్నారు.




# విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించాలి

- చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణలో కీసర ఎంఈఓ జమదగ్ని

**కీసర, నవంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే దిశగా పాఠశాల స్థాయిలో విభిన్న కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని కీసర మండల విద్యా అధికారి జమదగ్ని అన్నారు. కీసర మండల విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన "చెకుముకి సైన్స్ సంబరాలు - 2025" గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచడంలో చెకుముకి వేదిక ముఖ్యపాత్ర పోషిస్తోందని ఎంఈఓ జమదగ్ని పేర్కొన్నారు. పాఠశాల స్థాయిలో గోడపత్రికలు, సైన్స్ ఫెయిర్‌లు, ప్రతిభా పరీక్షలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. జెవివి నాయకులు శేషగిరిరావు మాట్లాడుతూ - చెకుముకి పరీక్షల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించడమే లక్ష్యమని తెలిపారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 7న, మండల స్థాయిలో నవంబర్ 21న నాగారం ప్రభుత్వ పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

# క్రీడా క్రమశిక్షణతోనే విజయం సాధ్యం





- జిల్లెల్ల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**నపర్తి,నవంబర్06(తెలంగాణ ముచ్చట్లు):** గోపాల్ పేట్ మండలం బుద్ధారం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాల 11వ క్రీడా మీట్ ఘనంగా నిర్వహించబడింది. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థుల చేత గౌరవ వందనం స్వీకరించారు.

డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు మరియు సమన్వయ సామర్థ్యాలను పెంపొందించడంలో సహాయపడతాయని తెలిపారు. క్రీడాకారులు దృఢంగా, శక్తివంతంగా ఉండటానికి పౌష్టికాహారం ముఖ్యమని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచి క్రీడాకారుల శారీరక ఆరోగ్యం కోసం కృషి చేస్తున్నదని వివరించారు.

డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్యంగా మహిళా క్రీడాకారుల విజయాలను ప్రశంసిస్తూ, ప్రపంచ కప్ క్రికెట్ పోటీలలో సాధించిన విజయం దేశ ప్రతిష్టను పెంచిందని, యువ క్రీడాకారులు కూడా ఇష్టమైన క్రీడల్లో నైపుణ్యాన్ని ప్రదర్శించాలన్న సూచన చేశారు. క్రీడల్లో గెలుపుఓటములు సహజమని, ఈ ప్రక్రియలో కష్టపడి మరింత శ్రమించడం ద్వారా విజయం సాధించవచ్చని విద్యార్థులను ప్రేరేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభవంతులైన క్రీడాకారులకు అవసరమైన వసతులు కల్పించడానికి సిద్ధంగా ఉందని, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని సూచించారు. అలాగే, గ్రూప్ 1, గ్రూప్ 2 నియామక పత్రాలు ఇచ్చే సమయంలో తల్లిదండ్రుల ఖాతాలో నేరుగా 20 శాతం జమ చేస్తారని వివరించారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో విజయవంతమైనవారిని డాక్టర్ చిన్నారెడ్డి మరియు ఆదర్శ్ సురభి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి జిల్లా జెడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు మరియు స్థానిక క్రీడాకారులు పాల్గొన్నారు.

# అధికారుల కనుసన్నల్లో అక్రమ నిర్మాణాలు

నాగారంలో అక్రమాలకు అంతం లేదా?

**నాగారం, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిబంధనల కు విరుద్ధంగా జరుగుతున్న అక్రమ నిర్మాణాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం వల్ల మున్సిపాలిటీ పరిధి మొత్తం రేకుల షెడ్లు, కమర్షియల్ భవనాలు కోకొల్లలు గా వెలుస్తున్నాయి.నాగారం రాంపల్లి మెయిన్ రోడ్ వెంబడి కమర్షియల్ షెడ్‌ల నిర్మాణాలు బహిరంగంగా జరుగుతున్నా అధికారులు "నిమ్మకు నిరెత్తినట్టు" వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై పలువురు ప్రజాప్రతి నిధులు, ముఖ్యంగా జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి వంటి వారు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా, ఇప్పటివరకు చర్యలేమీ తీసుకోక పోవడం ప్రజల్లో ఆగ్రహం రేపుతోంది.సర్వే నంబర్ 360లోని వెంకటేశ్వర కాలనీలో, పురాతన బావి దగ్గర సెట్‌బ్యాక్ లేకుండా బిల్డర్లు ఇంటి నిర్మాణాలు చేపట్టి వినియోగదారుల ను మోసం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రాంపల్లి రోడ్డులోని మరో నిర్మాణంలో సంపు, సెప్టిక్ ట్యాంక్‌నే రోడ్డుపైనే వేసినట్టు తెలుస్తోంది.ఇటీవల పత్రికలలో, సోషల్ మీడియాలో కూడా మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీదేవి, చైర్మన్‌ల నిర్లక్ష్యంపై వరుస వార్తలు వచ్చినా, కమిషనర్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లంచాల మాయం ఉందేమోననే అనుమానా లు వ్యక్తమవుతున్నాయి.అదే సమయం లో పేద, మధ్య తరగతి ప్రజలపై మాత్రమే పన్నులు, వడ్డీలు, బలవంతపు వసూళ్ల చర్యలు మున్సిపాలిటీ తీసుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.నాగారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఈ అక్రమాలపై పైస్థాయి అధికారులతో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజాప్రతినిధు లు, పత్రికా వర్గాలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.




# వైన్ షాప్ ఏర్పాటు ఆపాలని పెద్ద ఎత్తున కాలనీ వాసులు ధర్నా




**కుషాయిగూడ, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ సాయి నగర్ కాలనీలో వైన్ షాప్ ఏర్పాటు చేయవద్దని స్థానికులు, మహిళలు, కాలనీవాసులు భారీగా ఆందోళనకు దిగారు. గురువారం ఉదయం సాయి నగర్ కమాన్ సమీపంలోని యారో డ్రైవ్‌ఇన్ వద్ద కొత్త వైన్ షాప్ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే కాలనీవాసులు అక్కడకు చేరుకొని ధర్నా చేపట్టారు .ఈ సందర్భంగా చర్లపల్లి కాలనీల సమైక్య అధ్యక్షుడు వేంపల్లి పద్మా రెడ్డి, సాయి నగర్ కాలనీ అధ్యక్షుడు సారా వినోద్ కుమార్, జ్యోతి ఆక్రోపోలిస్ అపార్ట్మెంట్ నివాసులు మాట్లాడుతూ — "మా ప్రాంతం పూర్తిగా నివాస ప్రాంతం. ఇక్కడ వైన్ షాప్ ఏర్పాటు చేస్తే మహిళలు, పిల్లలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారు. మత్తు మద్యం దుకాణాలు సమాజంలో చెడు ప్రభావం చూపుతాయి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైన్ షాప్ పనులను వెంటనే ఆపాలని, లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకారులు జిహెచ్ఎంసి కాప్రా సర్కిల్ కార్యాలయం, కుషాయిగూడ పోలీస్ స్టేషన్, అబ్కారి అధికారులకు విన్నపాలు సమర్పించారు. కొంతసేపు రహదారిపై బైఠాయించి నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించడంతో నాగారం-కుషాయిగూడ ప్రధాన రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.స్థానిక పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రజలను శాంతింపజేశారు. పరిస్థితి అదుపులోకి రావడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరించబడింది. అయినా కూడా ఆందోళనకారులు వైన్ షాప్ నిర్మాణ ప్రాంగణం ఎదుట మళ్ళీ చేరి నిరసన కొనసాగించారు.ప్రజల అభ్యంతరాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, నివాస ప్రాంతాల్లో మద్యం షాపుల ఏర్పాటు నిలిపివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# టీడబ్ల్యూజేఏ హనుమకొండ జిల్లా కమిటీ ఎన్నిక



**అధ్యక్షుడిగా భూక్యా సిద్దు నాయక్ ఏకగ్రీవం**

**హసన్ పర్తి,నవంబర్ 06(తెలంగాణ ముచ్చట్లు):** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) హనుమకొండ జిల్లా నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హరిత కాకతీయ హోటల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా భూక్యా సిద్దు నాయక్ (టుడే ఫ్రీడమ్) హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఇస్లావత్ దేవేందర్ నాయక్ (సాక్షి), కోశాధికారిగా భూక్యా శ్రావణ్ కుమార్ (పబ్లిక్ న్యూస్), ఉపాధ్యక్షుడిగా నూనావత్ శ్రీనివాస్ నాయక్ (పబ్లిక్ న్యూస్), సహాయ కార్యదర్శిగా బాదావత్ ప్రదీప్ నాయక్ను ఎన్నుకున్నారు. అలాగే ఆంగోత్ సుధాకర్, బానోత్ అనిల్ నాయక్, లకావత్ సుమన్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్ నాయక్ మాట్లాడుతూ, "టీడబ్ల్యూజేఏ సంఘం అభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని కోరారు.ఏజెన్సీ ,మైదాన ప్రాంతాల గిరిజన జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని,వారికి ఇళ్ల స్థలాలు,అక్రిడిటేషన్లు కల్పించేందుకు ప్రభుత్వాన్ని కోరతామని తెలిపారు. గిరిజన జర్నలిస్టులందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ అందించే ప్రయత్నం జరుగుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కోకన్వీనర్ గుగులోత్ కల్యాణి,రాష్ట్ర నాయకుడు విజయ్ నాయక్ పాల్గొన్నారు.

# పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**వనపర్తి,నవంబర్06(తెలంగాణ ముచ్చట్లు-):** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పేదలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు మంజూరు చేసిన సీఎం సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూపాయలు 22,05,500/ఈ కార్యక్రమంలో పేదులకు అందజేయబడ్డాయి.

ఈ సందర్భంలో డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసినందున పేదలకు కావలసిన సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయడం కష్టమయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, సీఎం సహాయనిధి ద్వారా పేదలకు రికార్డు స్థాయిలో ఆర్థిక సాయం అందిస్తోందని చెప్పారు.

అతను పేదలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం లేనివారికి చికిత్స అనంతరం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక ఉపశమనం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమాన్ని గుర్తించి, ప్రతి రీతిలో కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు. సీఎం సహాయనిధి చెక్కులు అందుకున్న పేదలు చిరునామా వ్యక్తీకరణ ద్వారా సీఎం రేవంత్ రెడ్డి మరియు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్ర మైనార్టీ సీనియర్ నాయకులు, యువకుల నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు, మాజీ సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని రాచకొండ సీపీ ఆదేశాలు



**ప్రజా శాంతి భద్రతకు భంగం కలగకుండా కఠిన చర్యలు రాచకొండ సీపీ సుధీర్ బాబు, ఐపీఎస్**

**మల్కాజ్గిరి, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ కమిషనరేట్ పరిధిలో నేర నియంత్రణ, ప్రజా భద్రతను కాపాడే దిశగా పోలీసు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రాచకొండ పోలీసు కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ సూచించారు.ఇటీవలి కాలంలో కొంతమంది రౌడీ షీటర్లు మళ్లీ క్రియాశీలంగా మారుతున్నారన్న నివేదికల నేపథ్యంలో, అన్ని జోనల్ డీసీపీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్‌ఇన్‌స్పెక్టర్లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ప్రతి అధికారి తన పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలను నిత్యం పర్యవేక్షించాలి. వారు ఎక్కడ ఉంటున్నారు, ఎవరితో కలుస్తున్నారు, ఎలాంటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు అన్నదానిపై స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలి," అని సీపీ సుధీర్ బాబు ఆదేశించారు.రౌడీ షీటర్లు లేదా ఆస్తి నేరస్థులు ఏ విధంగానైనా ప్రజా శాంతి భద్రతకు భంగం కలిగిస్తే, వారిపై తక్షణ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనంగా, ఎస్ఓటీ (స్పెషల్ ఆపరేషన్స్ టీమ్), క్రైమ్ టీమ్‌లతో సమన్వయం చేసుకుంటూ రౌడీల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని ఆదేశించారు. రౌడీ షీటర్ల ఫైళ్లను, వారి గత నేర చరిత్రను పునః సమీక్షించి, అవసరమైతే పబ్లిక్ ప్లేసుల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు. సామాన్య ప్రజల్లో భయం, అసౌకర్యం కలిగించే ఎవరిపైనా పోలీసు వ్యవస్థ సహనానికి తావు ఇవ్వదని ఆయన స్పష్టం చేశారు. "ప్రజల భద్రత మా మొదటి ప్రాధాన్యత. రాచకొండ పరిధిలో శాంతి భద్రతను కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదు" అని సీపీ అన్నారు.

# మల్లాపూర్ సదర్ సమ్మేళనంలో పాల్గొన్న నెమలి అనిల్ కుమార్



**మల్లాపూర్, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మల్లాపూర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సదర్ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని యాదవ సోదర సోదరీమణులకు కార్తీక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ -"యాదవ సమాజం మన రాష్ట్ర సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇటువంటి సాంప్రదాయ కార్యక్రమాలు మన సంస్కృతిని సజీవంగా నిలుపుతున్నాయి. యువత ఇలాంటి ఉత్సవాల్లో పాల్గొని సమాజ ఐక్యతకు తోడ్పడాలి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ గ్రామ పెద్దలు, యాదవ సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సాహంగా సదర్ ఉత్సవాలను నిర్వహించారు. సాంప్రదాయ డప్పు వాయిద్యాలు, పశువుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.యాదవ సంఘ అధ్యక్షులు ఈ సందర్భంగా మాట్లాడుతూ -"ప్రతి ఏడాది కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే సదర్ సమ్మేళనం మన సమాజానికి ఐక్యతకు ప్రతీక. ఈ ఉత్సవం మన పశువుల పట్ల గౌరవం, ఆచార సంప్రదాయాల పట్ల భక్తిని చాటుతుంది" అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,యువనేత లు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ వ్యభిచారం నుండి ఉగాండా మహిళల రక్షణ ఒకరు అరెస్ట్

- **ప్రధాన నిందితుడు పరారీలో**

**రాచకొండ ఎహెచ్‌టియు పోలీసుల స్ఫూర్తిదాయక ఆపరేషన్**

**నాచారం, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** రాచకొండ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎహెచ్‌టియు పోలీసులు నాచారం స్థానిక పోలీసులతో కలిసి గురువారం నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో దాడి చేసి, ఆన్‌లైన్ లోకాంటో యాప్ ద్వారా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను బట్టబయలు చేశారు. ఈ దాడిలో ఉగాండా దేశానికి చెందిన ఇద్దరు విదేశీ జాతీయ మహిళలను రక్షించగా, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు భవానీనగర్ ప్రాంతంలోని ఓ గృహంపై దాడి చేయగా, అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్టు తేలింది.నిందితుల వివరాలు:డేనియల్ - నిర్వాహకుడు పరారీలో ఉన్నాడు. సంపత్ కుమార్ మోహితే (59), దివంగత నాగేందర్ రావు కుమారుడు, ప్రభుత్వ ఉద్యోగి (పోస్టల్), నివాసం: శ్రీ నిలయ టౌన్‌షిప్, బడంగ్‌పేట్, సరూర్‌నగర్ మండలం - కస్టమర్‌గా వ్యవహరించాడు.స్వాధీనం చేసుకున్న వస్తువులు:రూ. 8,050/నగదు.రూ. 500/ మరియు రూ. 1,000/ జిపే యూపీఐ చెల్లింపులు .6 మొబైల్ ఫోన్లు,2 కండోమ్‌లు దర్యాప్తులో డేనియల్ లోకాంటో యాప్ ద్వారా ఆన్‌లైన్ వ్యభిచార గృహాన్ని నడుపుతూ, బాధిత మహిళల ఫోటోలను ఆన్‌లైన్‌లో పంచి కస్టమర్లను ఆకర్షించి డబ్బు వసూలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.ఈ ఆపరేషన్ రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ మార్గదర్శకత్వంలో, ఎల్.బి.నగర్-మహేశ్వరం ఎస్‌ఓటి ఏడిసిపి ఎం.డి. షకీర్ హుస్సేన్, రాచకొండ ఎహెచ్‌టియు ఇన్‌స్పెక్టర్ ఎస్.దేవేందర్, నాచారం ఇన్‌స్పెక్టర్ కె. ధనుంజయ మరియు సిబ్బంది పర్యవేక్షణలో విజయవంతంగా నిర్వహించారు. సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ఘనపూర్, నవంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని లింగాల ఘనపూర్ మండలం జీడికల్ గ్రామంలోని వీరాచల జీడికంటి శ్రీ రామచంద్ర స్వామి ఆలయంలో రూ.54 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గురువారం ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఈజీఎస్, ఎస్డిఎఫ్, ఎంపీ నిధుల ద్వారా నిర్మించిన సిసి రోడ్డు, కోనేరు వరకు మెట్ల నిర్మాణం, హైమాస్ట్ లైట్లు వంటి సౌకర్యాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ,
"ప్రజలందరి సహకారంతో జీడికల్ రామచంద్ర స్వామి ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నదే నా సంకల్పం" అని



పేర్కొన్నారు.
ఆలయ అభివృద్ధి కోసం దాతలను సంప్రదించి భక్తులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ధర్మకర్తల మండలికి సూచించారు. ఇంకా బస్టాండ్ నుండి దేవస్థానం వరకు రోడ్డు నిర్మాణం, సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా త్వరలో చేపట్టాలని తెలిపారు.
స్వామి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం మరియు పోలీస్ శాఖలు కలసి హెల్ప్ లైన్ సేవలను ఏర్పాటు చేయాలని తెలిపారు.
"ఆలయాభివృద్ధిలో రాజకీయాలు అవసరం లేవు. ఇది భక్తి, సేవ, సమర్పణకు ప్రతీక. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనేలా అందరూ కృషి చేయాలి" అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డీవో గోపినాథ్, ఆలయ చైర్మన్, డైరెక్టర్లు, మార్కెట్ వైస్ చైర్మన్, మండల నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ ఎడ్యుకేటర్ అవార్డ్ అందుకున్న తక్షశిల ఉపాధ్యాయులు





**తార్నాక, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)** తార్నాకలోని ప్రముఖ విద్యాసంస్థ తక్షశిల పబ్లిక్ స్కూల్ కు చెందిన పలువురు ఉపాధ్యాయులు విద్యారంగంలో చేసిన అద్భుత సేవలకు గాను డా. రాధాకృష్ణన్ టీచర్స్ సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నేషనల్ ఎడ్యుకేటర్ అవార్డ్ అందుకున్నారు.ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న ఉపాధ్యాయులు పూజా సింగ్, శిరీష, శిల్పా సంగ్, రేఖ. వీరు బోధనలో సృజనాత్మక విధానాలను ప్రవేశ పెట్టి, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతా భావం పెంపొందించడంలో కీలక పాత్ర పోషించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. అజిత్ కుమార్ చౌహాన్ మాట్లాడుతూ "ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పేవారు మాత్రమే కాదు, సమాజ నిర్మాణానికి పునాది వేస్తారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, మానవతా విలువలు పెంపొందించడం ద్వారా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. తక్షశిల ఉపాధ్యాయులు చూపిన అంకితభావం అందరికీ ఆదర్శం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ భోలా సింగ్, తెలంగాణ ఇంచార్జ్ బబితా చక్కిలం, డా. సురభి దత్, డా. రాజీవ్ సింగ్ తదితరులు పాల్గొని పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.సంస్థ తరఫున ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు, స్మారక ఫలకాలు అందజేసి ఘనంగా సత్కరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, సహచర ఉపాధ్యాయులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా ఎంపీ కడియం కావ్య విస్తృత ప్రచారం





**హైదరాబాద్,నవంబర్06(తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి మద్దతుగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య బోరబండ డివిజన్‌లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్వరాజ్ నగర్, రాజ్ నగర్ కాలనీల్లో గడపగడపకు తిరుగుతూ కాలనీవాసులను ఆప్యాయంగా పలకరించిన ఆమె, కాంగ్రెస్ పార్టీ 'చేతి' గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ అంటేనే సంక్షేమం, అభివృద్ధి. పేదల సంక్షేమం కోసం పనిచేసే కాంగ్రెస్‌నే ప్రజలు విశ్వసిస్తున్నారు. నవీన్ యాదవ్ గెలిస్తే జూబ్లీహిల్స్ ప్రజలకు మేలు జరుగుతుంది" అని తెలిపారు.
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గృహాలు, ప్రతి ఇంటికి విద్యుత్ సరఫరా, ఒక్కొక్కరికి 6 కిలోల సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ₹500 గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలు ప్రజల మద్దతుతో విజయవంతంగా కొనసాగుతున్నాయని వివరించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని ప్రజలను విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తుందని చెప్పారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
శుక్రవారం-07- నవంబర్ 2025





# నవీన్ యాదవ్ కు మద్దతుగా

## ఎమ్మెల్సీ విజయశాంతితో కలిసి ఎంపీ కడియం కావ్య ప్రచారం

**హైదరాబాద్,నవంబర్06(తెలంగాణ ముచ్చట్లు):** జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయానికి మద్దతుగా బోరబండ డివిజన్‌లో ఎమ్మెల్సీ విజయశాంతి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య సంయుక్తంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు స్వరాజ్ నగర్, రాజ్ నగర్ ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టి, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ యువ నాయకుడిగా జూబ్లీహిల్స్ అభివృద్ధికి కృషి చేస్తారనీ, ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే మా లక్ష్యం

**చీఫ్ ఇంజనీర్ కామేష్**

**దమ్మాయిగూడ, నవంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)**

కీసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే తమ ప్రధాన లక్ష్యమని విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ కామేష్ తెలిపారు. సిఎండి ఆదేశాల మేరకు గురువారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని చేర్యాల గణేష్‌టౌన్షిప్, ఎస్సీ కాలనీలలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ కామేష్ స్వయంగా అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటించి, స్థానిక విద్యుత్ సమస్యలను పరిశీలించారు. చెట్ల కొమ్మలు తొలగింపు, డిటిఆర్ నిర్వహణ, యార్డ్ క్లీనింగ్, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద ఏర్పడే విద్యుత్ అంతరాయాల వంటి అంశాలపై తక్షణ చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ప్రజలకు ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ డిఈ టి.లింగయ్య, ఏడిఈ సిహెచ్.నందకిషోర్, ఏఈ మురళీకృష్ణ, సెక్షన్ సిబ్బంది శ్రీనివాసులు, నరసింహా, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయాల్లో కుటుంబరాజ్యం: ప్రజాస్వామ్యానికి ముప్పా..?

- పార్టీల్లో వారసత్వ రాజకీయల పెరుగుదల
- అవకాశాలు – అడ్డంకులు

దేశ రాజకీయాల్లో కుటుంబరాజ్యం కొత్త విషయం కాదు. కానీ తాజాగా ఇది అత్యంత వేగంగా విస్తరిస్తున్న ధోరణిగా మారింది. తండ్రి - కుమారుడు, తల్లి - కుమారుడు, అక్క - తమ్ముడు, తాత - మనవడు... ఇలా అనేక కుటుంబాలు వరుసగా అధికారం చేపట్టే పరిస్థితి కనిపిస్తోంది. ప్రజాస్వామ్యంలో ప్రతిభ, ప్రజాభిమానమే నాయకత్వానికి అర్హత అయినా, కుటుంబ వారసత్వం ఇప్పుడు సార్ట్‌కట్‌గా మారిపోవడం ఆందోళనకరం.




కుటుంబరాజ్యాన్ని సమర్థించే వాదనల్లో "ప్రజలు ఓటేస్తున్నారు కాబట్టే గెలుస్తున్నారు, అందులో తప్పేముంది?" అన్న ప్రశ్న ముందుంటుంది. కానీ సమస్య వేరే చోట ఉంది. పార్టీల్లో కీలక పదవులు, టికెట్లు, పదవులు——అన్నీ కుటుంబ సభ్యులకే కేటాయించే పరిస్థితి వస్తే, మిగతా కృషి చేసే కార్యకర్తలకు అవకాశం లేకుండా పోతుంది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం క్షీణించడంతో, నాయకుల ఎంపిక ప్రతిభ ఆధారంగా కాకుండా వంశపారంపర్యంగా మారిపోతుంది.

కుటుంబరాజ్యం పెరిగితే రాజకీయాలు ప్రజాసేవ నుంచి దూరమై వ్యక్తిగత వ్యాపారం లాగా మారే ప్రమాదం ఎక్కువ. పాలనలో తీసుకునే నిర్ణయాలు కూడా ప్రజల ప్రయోజనాల కంటే కుటుంబ ప్రయోజనాలకే మారే అవకాశం ఉంది. అధికారంలో ముఖ్యమైన పదవులు, లాభదాయక హోదాలు కుటుంబ సభ్యుల మధ్యనే పంచుకుని, ప్రభుత్వ వ్యవస్థ మామూలు ప్రజలకు అందని కోటలా మారిపోతుంది.

అయితే, కుటుంబరాజ్యం ఉన్న వారందరూ చెడ్డ పాలన చేస్తారనే మాట కూడా సరైంది కాదు. అనుభవం, రాజకీయ అవగాహన, ప్రజలతో అనుబంధం... ఇవి కుటుంబంలో నేర్చుకోగలిగే అంశాలు. కొన్ని సందర్భాల్లో కుటుంబ వారసత్వంలో వచ్చిన నాయకులు ప్రజాదరణ పొందుతూ మంచి పాలన చేసిన ఉదాహరణలు కూడా ఉన్నాయి. కాబట్టి, సమస్య కుటుంబ నేపథ్యం కాదు——అర్హత లేకుండా కేవలం వారసత్వంతో నాయకత్వం దక్కడం.

భవిష్యత్తులో కుటుంబరాజ్యం తగ్గాలంటే ప్రజల్లో అవగాహన పెరగాలి. ఓటు వేయడంలో "ఎవరి కుమారుడు?" అని కాదు, "ఎవరి పనితీరు?" అని ఆలోచించే సంస్కృతి రావాలి. రాజకీయ పార్టీలలో అంతర్గత ఎన్నికలు తప్పనిసరి చేసి, ప్రతిభ, కృషి, ప్రజాప్రయోజనాల ఆధారంగా నాయకత్వం ఇవ్వాలి. అప్పుడే ప్రజాస్వామ్యం ఆరోగ్యంగా ఉంటుంది.

ప్రజాస్వామ్యానికి బలం నాయకుల వంశపారంపర్యంలో కాదు, ప్రజల విశ్వాసంలో ఉంటుంది. "కుటుంబం" కాదు, "కెపాబిలిటీ" ప్రధాన ప్రమాణంగా మారే రోజే నిజమైన ప్రజాస్వామ్య విజయం.

# ఎగిసిపోతున్న విద్యా ఫీజులు

- మధ్యతరగతి కలలను మింగేస్తున్న భారాలు
- ప్రైవేట్ విద్య ఖర్చు కట్టడి తప్పనిసరి
- విద్య వాణిజ్యమా? బాధ్యత ఎవరిది?

చదువు అంటే మనుగడకు ఆయుధం. కానీ కాలం మారింది; ఇప్పుడు చదువు అంటే అప్పుల బానిసైన భవిష్యత్తు. ప్రాథమిక పాఠశాల నుండి ఉన్నత విద్య వరకు ఫీజులు అమాంతం పెరిగిపోయి, మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక స్తోమతను ఢీకొడుతున్నాయి. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం అంటే తల్లిదండ్రులకు సంతోషకరమైనది కాదు, భయంకరమైన ఆర్థిక భారాల కాలం. విద్యను సేవగా కాకుండా లాభాత్మక వ్యాపారంగా మార్చిన వ్యవస్థపై ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఒకప్పటి ప్రభుత్వ పాఠశాలలు సాధారణ ప్రజల విద్యా అవలంబన. కానీ నేటి పరిస్థితుల్లో నాణ్యతాభావం, మౌలిక సదుపాయాల లేకపోవడం, ఫలితాలపై సందేహాలు వంటి కారణాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపడం తప్ప మరో మార్గం కనిపించడంలేదు. ఈ అవకాశాన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు పూర్తిగా వాణిజ్యీకరించడంతో నెలకు జీతం వచ్చే కుటుంబానికి పిల్లల చదువు ఖర్చు "ఐశ్వర్యవంతమైన కర్తవ్యంగా" మారింది.

పాఠశాలల్లో ఫీజుల పేరే ఎన్నో ట్యూషన్ ఫీ, అడ్మిషన్ ఫీ, యాక్టివిటీ ఫీ, డెవలప్మెంట్ ఫీ, బిల్డింగ్ ఫండ్, ట్రాన్స్‌పోర్ట్ ఫీ... ఇలా పేర్లు మాత్రమే మారతాయి కానీ కరెన్సీ వెళ్లేది మాత్రం తల్లిదండ్రుల జేబులోనుండే. LKG నుంచే సంవత్సరానికి లక్ష రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తున్న వేళ, విద్య మౌలిక హక్కు అంటున్న భావన ఎక్కడ నిలబడుతుంది?



ఉన్నత విద్యలో పరిస్థితి మరింత దారుణం. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ వంటి కోర్సుల్లో ఫీజులు సామాన్య కుటుంబ సామర్థ్యాన్ని మించి ఉన్నాయి. డొనేషన్ల పేరిట తీసుకునే రూపాయి విలువలు కోట్లలో తిరుగుతున్నాయి. చదువు పూర్తయిన వెంటనే దశాబ్దాల పాటు స్టూడెంట్ లోన్లు తీర్చుకోవాల్సిన బాధ్యత యువత భుజాలపై పడుతోంది. చదువు జీవితం మార్చాలని ఉండగా, జీవితాన్ని అప్పులోకి నెడుతోంది.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫీజు నియంత్రణ కమిటీలు, నియమాలు కాగితాలపైనే మిగిలిపోయాయి. పర్యవేక్షణలో లోపాలు, రాజకీయ ప్రభావం, ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడి కారణంగా ఫీజు కట్టడిపై చర్యలు సడలిపోయాయి. కొందరు పాఠశాలలు, కళాశాలలు చట్టాలకు ధిక్కారం పలుకుతూ ఎటువంటి పారదర్శకత లేకుండా ఫీజులను నిర్ణయిస్తున్నాయి. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే, "ఇష్టం లేని వారు తీసుకెళ్లండి పిల్లలను" అనే ధోరణి మరింత బాధాకరం.

విద్యా వ్యవస్థలో దీర్ఘకాలిక పరిష్కారానికి ప్రభుత్వ పాఠశాలల బలోపేతం తప్పనిసరి. అవి నాణ్యత, సౌకర్యాలు, బోధనా ప్రమాణాలను పెంచి, ప్రైవేట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా నిలవాలి. విద్యను వ్యాపారంగా చూసే ధోరణి తగ్గాలంటే ప్రభుత్వ రంగం పోటీగా నిలబడాలి. లేదంటే ప్రైవేట్ అధికారం తొలగకపోగా, ఫీజుల పెరుగుదల ఎప్పటికీ నియంత్రణలోకి రాదు.

తల్లిదండ్రులు కూడా మారాలి. ప్రదర్శనల కోసం పాఠశాలల గ్లామర్, ఇంగ్లిష్ యాక్సెంట్, ఎయిర్‌కండిషన్ క్లాస్‌రూమ్స్ కంటే బోధన నాణ్యత, విలువలు, అభ్యాస పద్ధతులను గుర్తించాలి. విద్యార్థుల భవిష్యత్తు కేవలం "పొదుపు చేయలేని విలాస ఖర్చు"గా మారకూడదు. విలువలతో కూడిన విద్యే సమాజానికి పునాది.

విద్య అందరికీ చేరాలి అంటే ఫీజుల కట్టడి అవసరం. లేనిపక్షంలో ధనవంతులకు మాత్రమే నాణ్యమైన విద్య, మిగతావారికి అవకాశాల లేమి అనే అసమాన సమాజం ఏర్పడుతుంది. విద్య వ్యాపారం కాదు.. సమాజ నిర్మాణం అనే నమ్మకాన్ని కాగితాల నుండి కార్యచరణలోకి తీసుకురావాల్సిన సమయం ఇదే.

# హైదరాబాద్, బెంగళూరు జీసీసీ ఆధిపత్యం

గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) అడ్డాగా హైదరాబాద్, బెంగళూర్ల హవా కొనసాగతున్నది. ఇప్పటికీ దేశంలోని ప్రతీ 10 జీసీసీల్లో 7 సెంటర్ల నాయకత్వం ఈ రెండు నగరాల ఆధారంగానే పనిచేస్తున్నది మరి. ఈ మేరకు బుధవారం క్వెస్ కార్ప్స్ 'ఇండియాస్ జీసీసీఐటీ టాలెంట్ ట్రెండ్స్ 2025: న్యూ ఎంట్రెంట్స్ షేపింగ్ ఇండియాస్ క్యాపబిలిటీ ఎవల్యూషన్' పేరిట విడుదలైన నివేదిక తెలియజేసింది. నాయకత్వం దృష్టి ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు వ్యాప్తంగానే ఉంటున్నదని స్పష్టం చేసింది.సంస్థాగతంగా కొత్త ఉద్యోగులు, సేవలు, సైప్లల కోసం గత ఏడాదితో పోల్చితే 42 శాతం ఎక్కువగా అభ్యర్థనలు ఈసారి హైదరాబాద్ నుంచి పెరిగినట్టు ఈ నివేదిక తెలిపింది. 68 శాతం పోటీతత్వ ప్రీమియం ఇక్కడ ఆకర్షణీయంగా



కనిపిస్తున్నది. నిజానికి దేశవ్యాప్తంగా జీసీసీలను ఆకట్టుకుంటున్న నగరాల్లో హైదరాబాద్‌తోపాటు బెంగళూరు ముందు వరుసలో ఉంటున్నాయని ఎప్పట్నుంచే అనేక సర్వేలు చెప్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో తాజా సర్వే అందుకు మరోసారి అద్దం పట్టింది. ఇదిలావుంటే బెంగళూరు ప్రతిభావంతులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తున్నది. ఈ క్రమంలోనే మార్కెట్ సగటును మించి ఇక్కడి వ్యయ సూచీ 810 శాతం పలుకుతున్నది.చెన్నై కూడా ఫైనాన్స్, రిస్క్, కంట్రోల్‌ఓరియెంటెడ్ వర్క్ కోసం జీసీసీలకు ఓ చక్కని ఎంపికగా ఎదుగుతుండటం గమనార్హం. ఈ కోణంలో దాదాపు 94 శాతం రిటెన్షన్ లెవల్‌స్‌ను చెన్నై సొంతం చేసుకున్నది. దేశంలోని ప్రథమ శ్రేణి నగరాల్లో ఇదే అత్యధికం. అనలిటిక్స్, క్వాలిటీ అస్యూరెన్స్‌ల్లో పుణె బలపడుతుండగా.. ద్వితీయ శ్రేణి నగరాల్లో కొచ్చి, కోయంబత్తూర్, అహ్మదాబాద్, ఇండోర్ ముందు వరుసలో ఉన్నాయి. ఇదిలావుంటే 'ఇండియా న్యూ జీసీసీ టాలెంట్ ట్రెండ్స్ 2025: ఫ్రం కెపాసిటీ టు క్యాపబిలిటీ' ఆధారంగా మరో రిసెర్చ్ రిపోర్టును కూడా క్వెస్ కార్ప్స్ విడుదల చేసింది. ఇందులో టెక్నాలజీ వంటి కీలక రంగాల్లో నైపుణ్యం కొరత కనిపిస్తున్నట్టు తేలింది.

# ఇక జాబ్‌లెస్ ఫ్యూచరే!

**దేశంలో ముున్ముందు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉంటాయని మెర్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వ్యవస్థాపకుడు, ఆ కంపెనీ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సౌరభ్ ముఖర్జియా హెచ్చరించారు. 'ఉద్యోగాల వృద్ధి ఆగిపోయింది' అంటూ ఇటీవలి ఓ పాడ్‌కాస్ట్‌లో సంచలన వ్యాఖ్యలు చేయడం గమనార్హం. నిజానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టైటాన్, ఏషియన్ పెయింట్స్ వంటి భారీ సంస్థలు వ్యాపార విస్తరణలో ఉన్నాయని, సహజంగా ఇలాంటప్పుడు ఉద్యోగావకాశాలు పెరగాలని, అయితే ఆటోమేషన్, వ్యయ నియంత్రణ కారణంగా పెద్దగా ఉద్యోగాలు వచ్చే వీల్లేదని అన్నారు.**

**ఏటా 80 లక్షల గ్రాడ్యుయేట్లు**

**ఏటా దేశంలో కొత్తగా 80 లక్షల గ్రాడ్యుయేట్లు ఉద్యోగాల కోసం అన్వేషణ మొదలు పెడుతున్నారని, కానీ వారి కలలకు, ఉన్న అవకాశాలకూ పొంతనే లేకుండా పోతున్నదని సౌరభ్ తెలిపారు. దీంతో కొన్నేండ్లలో దేశ యువత, ముఖ్యంగా మధ్యతరగతివారు ఉద్యోగాల్లేని ప్రపంచాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే సంప్రదాయ ఉద్యోగాల స్థానంలో యాంత్రిక సామర్థ్యాలు వచ్చాయని, ముున్ముందు ఈ ధోరణి పెరిగి అంతటా మానవ వనరుల వినియోగం తగ్గిపోవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.గతంలో మనుషుల ద్వారా నడిచిన వ్యవస్థలన్నీ ఇప్పుడు సాంకేతికత ఆధారంగా నడుస్తున్నాయని గుర్తుచేశారు. మారుతున్న మార్కెట్ ముఖచిత్రం, అవసరాలు కూడా కంపెనీలను టెక్నాలజీపై ఎక్కువ ఆధారపడేలా చేస్తున్నాయని, దీనివల్ల**




**ఉద్యోగులకు ముప్పేనని హెచ్చరించారు. ప్రస్తుతం చాలా రంగాల్లో గిగ్ వర్కర్లు వచ్చేశారని, ఇది కూడా జాబ్‌లెస్ ఫ్యూచర్‌కు నిదర్శనమేనన్నారు. మొత్తానికి భావితరాలను చిన్నప్పట్నుంచే మారుతున్న పరిస్థితులకు తగ్గట్టుగా సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.**

# రూ.6తో రూ.40,00,000 బెనిఫిట్..

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అకౌంట్ చాలా మందికి ఉంటుంది. ఎస్‌బీఐలో ఖాతా ఉంటే తమ డబ్బులు సురక్షితమని భావిస్తారు. కానీ, ఆ ఖాతా ద్వారా వచ్చే చాలా రకాల బెనిఫిట్స్ గురించి చాలా మందికి తెలియదనే చెప్పాలి. ఎందుకంటే ఎస్‌బీఐ ఖాతా ద్వారా రోజుకు రూ.5.48 చెల్లిస్తూ ఏకంగా రూ.40 లక్షల బెనిఫిట్ పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్ ఉన్న బ్యాంకుల్లోనూ ఈ సదుపాయాన్ని పొందొచ్చు. మరి అది ఎలాగో తెలుసుకుందాం.ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు మనకు తెలియకుండానే చాలా రకాల ఖర్చులు చేస్తుంటాం. ఒక కాఫీ తాగితేనే రూ.20 ఖర్చవుతుంది. అదే దోసే, బజ్జి వంటివి తింటే రూ.50 ఆపైనే అవుతుంది. కానీ, మీ జీవితానికి భరోసా కల్పించేందుకు అయ్యే ఖర్చు ఎంతో తెలుసా కేవలం రోజుకు రూ.5.48. అవునండీ ఇది నిజమే. మీ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్ ద్వారానే రోజుకు రూ.6 కన్నా తక్కువ చెల్లించి ఏకంగా రూ.40 లక్షల బెనిఫిట్ పొందవచ్చు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తమ ఖాతాదారులకు ఈ సౌకర్యాన్ని అందిస్తోంది. రూ.40 లక్షల బీమా భరోసా ఎలా పొందాలి అనే వివరాలు ఈ కథనం ద్వారా తెలుసుకుందాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) తమ




అనుబంధ సంస్థ ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో తమ ఖాతాదారులకు సమగ్రమైన, చౌకైన వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీని అందిస్తోంది. అనుకోని ప్రమాదాలతో తమ కుటుంబం ఆర్థికంగా చితికిపోకుండా కాపాడుకునేందుకు ఖాతాదారులకు అద్భుతమైన అవకాశం కల్పిస్తోంది. పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ అందిస్తోంది. ఈ పాలసీ కోసం ఏడాదికి రూ.2000 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. అంటే రోజుకు రూ.6 కన్నా తక్కువే (రూ.5.48 మాత్రమే) చెల్లిస్తే సరిపోతుంది. దీంతో ఏకంగా రూ.40,00,000 భరోసా లభిస్తుంది.ఏదైనా ప్రమాదం జరిగినా లేదా ఆఖరకు పాము కాటుతో మరణించినా బాధితుడి సూచించిన నామినీకి ఏకంగా రూ.40 లక్షలు ఎస్‌బీఐ అందిస్తుంది. నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఈ స్కీమ్‌లో నమోదు చేసుకుని రూ.40 లక్షల భరోసా పొందాలంటే బ్యాంకుకు వెళ్లి ఖాతాదారుడు తన సేవింగ్స్ అకౌంట్ నుంచి ప్రీమియం ఆటోమేటిక్‌గా కట్ చేసుకునేందుకు బ్యాంకుకు అనుమతించాల్సి ఉంటుంది. 18 ఏళ్ల వయసు నుంచి 65 ఏళ్ల వయసు లోపు వారికి అర్హత ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు, విద్యుత్తు ప్రమాదాలు, వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, పాము తేలు కాటుకు సైతం ఈ బీమా వర్తిస్తుంది. ఎస్‌బీఐతో పాటుగా ఐసీఐసీఐ, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ వంటి ప్రైవేట్ రంగ బ్యాంకులు సైతం ఇలాంటి ప్రమాద బీమా పథకాలను తమ ఖాతాదారులకు అందిస్తున్నాయి. మీకు కూడా బ్యాంకులో ఖాతా ఉంటే వెంటనే ఈ పాలసీని తీసుకోండి. మీరు ఎస్‌బీఐ ఖాతాదారు అయితే మీ బ్యాంక్ బ్రాంచుకు వెళ్లి అక్కడే ఉండే ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ అడ్వైజర్‌ను కలవడమే. మీరు ఒకసారి ప్రీమియం చెల్లించడం ప్రారంభిస్తే ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా ప్రీమియం చెల్లించేలా ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఏడాదికి రూ.2000తో రూ.40 లక్షల బెనిఫిట్ పొందొచ్చు. లేదంటే రూ.1000 కడితే రూ.20 లక్షల బీమా ఉంటుంది, అదికూడా కాకుంటా రూ. 100 చెల్లిస్తే రూ.2 లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# బీహార్ తొలి దశ పోలింగ్‌లో రికార్డు ఓటింగ్‌కు పిలుపు

- **ఓటు హక్కును వినియోగించుకోవాలి: కేంద్ర హోం మంత్రి అమిత్ షా..**
- **వికాసం, భద్రత, విద్యపై ఓటర్ల దృష్టి**



బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలి దశ పోలింగ్ జరుగుతున్న సందర్భంగా, ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ బూత్‌లకు చేరి తమ ఓటు హక్కును వినియోగించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొని రికార్డు ఓటింగ్ శాతాన్ని నమోదు చేయాలని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు సందేశం పంపించారు.

ప్రతి ఓటు రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో కీలకమని పేర్కొంటూ, బీహార్‌లో శాంతి, స్థిరత్వం మరియు అభివృద్ధి నిలబెట్టడంలో ప్రజల ఓటు ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. భద్రత, చట్టవ్యవస్థ, సరిహద్దు ప్రాంతాల పరిస్థితి వంటి అంశాలపైనా ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు. విద్యా సదుపాయాల మెరుగుదల, పేదల సంక్షేమం, యువతకు ఉద్యోగావకాశాల పెంపు, రాష్ట్ర అభివృద్ధి దిశగా ముందడుగు—ఇవన్నీ ప్రజలు ఓటు వేస్తున్నప్పుడు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. బీహార్ గౌరవం, స్వావలంబన, అభివృద్ధి లక్ష్యాల సాధనలో ప్రజల ఓటు ప్రతిష్టాత్మకమని ఆయన పేర్కొన్నారు.

బీహార్‌లో ఈరోజు మొదటి దశలో పలువు నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగుతోంది. ఎక్కడికక్కడ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల క్యూలు కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు, భద్రతా బలగాల నిఘా, పోలింగ్ శాంతియుతంగా సాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. మొదటి దశ పోలింగ్ శాతం సాయంత్రం తరువాత తేలనుంది. బీహార్ భవిష్యత్తు ఏ దిశగా సాగుతుందో ప్రజలు ఏ విధమైన తీర్పును ఇస్తారనే దానిపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



# రాష్ట్రప్రతి ద్రౌపదీ ముర్ము ను కలిసిన మహిళల క్రికెట్ జట్టు



ఐసీసీ మహిళల క్రికెట్ వరల్డ్ కప్-2025 విజేత భారత మహిళా క్రికెట్ జట్టు రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపదీ ముర్మును కలిసి శుభాకాంక్షలు అందుకుంది. ఈ సందర్భంగా ముర్ము జట్టు సభ్యులను అభినందిస్తూ, "మీరు చరిత్ర సృష్టించారు. మా దేశ యువతకి మీరు ఆదర్శం" అని పేర్కొంది. ఈ జట్టు దేశ వైవిధ్యానికి ప్రతీకగా నిలిచిందని ముర్ము భావోద్వేగంగా చెప్పింది. దేశంలోని రాంతాల నుంచి, భిన్న సామాజిక నేపథ్యాలతో వచ్చినా... ఒకే లక్ష్యం కోసం పోరాడి విజయం సాధించిన టీమ్ ఇది 'టీమ్ ఇండియా' అని ఆమె స్పష్టం చేసింది.

మహిళల క్రీడలకు దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణ నేపథ్యంలో ఈ విజయం ఎంతో ప్రేరణాత్మకమని రాష్ట్రప్రతి పేర్కొంది. భారత జట్టు వరల్డ్ కప్ గెలిచిన నేపథ్యంలో ఆటగాళ్ల త్యాగం, కష్టపాటు, నిబద్ధత దేశానికి గర్వకారణమని ఆమె అభినందించింది.

సమావేశంలో బిసిసిఐ ప్రతినిధులు, కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్, ఎంపిక కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు.

# పీఎం సర్... మీ స్కిన్‌కేర్ రహస్యమేంటి?

- **హర్లీన్ డియోల్ సరదా ప్రశ్న**
- **మహిళా క్రికెటర్లతో మోదీ భేటీ నవ్వులతో నిండింది**

మొదటిసారిగా వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళా క్రికెట్ జట్టుతో ప్రధాని నరేంద్ర మోదీ జరిగిన భేటీ నవ్వుల మధ్య సాగింది. మహిళా క్రికెటర్లు పీఎంతో సరదాగా సంభాషించగా, బ్యాటింగ్ ఆల్‌రౌండర్ హర్లీన్ డియోల్ అడిగిన ప్రశ్న అక్కడి వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చింది. సంభాషణలో భాగంగా హర్లీన్ నవ్వుతూ, "సర్... మీరు ఎప్పుడూ ఇంత కాంతివంతంగా ఉంటారు. మీ స్కిన్‌కేర్ రహస్యమేంటి?" అని ప్రశ్నించారు. అప్రత్యక్షంగా వచ్చిన ఈ ప్రశ్నకు మహిళా క్రికెటర్లు, అక్కడున్న అధికారులు అందరూ నవ్వుల్లో మునిగిపోయారు. దీనికి ప్రధాని మోదీ నవ్వుతూ స్పందిస్తూ, "నేను అలాంటి విషయాల గురించి అసలు పట్టించుకోను" అని సమాధానమిచ్చారు. వెంటనే మరో క్రికెటర్ స్నేహ్ రాణా స్పందిస్తూ, "సర్, దేశంలోని కోట్లాది మంది ప్రేమ వల్లే మీకిది సాధ్యమైందేమో!" అని చెప్పడంతో మళ్లీ హాస్యభరిత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంలో టీమ్ హెడ్ కోచ్ అమోల్ మజుందార్ కూడా హాస్యాన్ని పంచుకున్నారు. "చూశారా సర్... ఇలాంటి వారితో నేను డీల్ చేయాల్సిరావడం వల్లనే నా జుట్టంతా తెల్లబడిపోయింది" అని చమత్కరించడంతో మరోసారి నవ్వులు వెల్లువెత్తాయి. భేటీ సందర్భంగా మోదీ, 2021లో ఇంగ్లండ్‌పై మ్యాచ్‌లో హర్లీన్ డియోల్ క్యాచ్ తీసిన అద్భుత క్షణాన్ని కూడా గుర్తుచేశారు. సమావేశంలోని ఈ సరదా సంభాషణను ప్రధాని తన సోషల్ మీడియా అకౌంట్లలో పంచుకున్నారు.







# ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్‌తో పుదుచ్చేరి వర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొ. పి. ప్రకాష్ బాబు భేటీ

పుదుచ్చేరి విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొ. పి. ప్రకాష్ బాబు నేడు పార్లమెంట్ భవన్‌లో భారత ఉపరాష్ట్రపతి సి. పి. రాధాకృష్ణన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విశ్వవిద్యాలయ ప్రగతి, భవిష్యత్ లక్ష్యాలపై వివరించారు. విశ్వవిద్యాలయ ఎక్స్‌ఆఫీషియో ఛాన్స్‌లర్ అయిన ఉపరాష్ట్రపతికి అకడమిక్, పరిపాలనా అంశాలపై సమగ్రంగా నివేదించినట్లు సమాచారం. సమావేశంలో విశ్వవిద్యాలయం అందిస్తున్న కోర్సులు, మౌలిక వసతులు, విద్యార్థి సంక్షేమ కార్యక్రమాలు, పరిశోధన-ఆవిష్కరణ ప్రోత్సాహం, ఆలుమ్నై సంబంధాలు, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు, సోలార్ విద్యుత్ ఉత్పత్తి వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు సమృద్ధిగా ఉండాలని, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టాలని ఉపరాష్ట్రపతి సూచించారు. క్యాంపస్ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను బలోపేతం చేయాలని, ఎస్సీ/ఎస్టీ రిజర్వేషన్ సీట్లు సక్రమంగా భర్తీ చేయాలని, స్థానికులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. బాలికల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ఆయన గుర్తుచేశారు. విద్యార్థుల కోసం సమర్థవంతమైన ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలు ఏర్పాటు చేయడం, డ్రగ్స్ మత్తు దుష్ప్రభావాలపై అవగాహన, కౌన్సిలింగ్-ప్రేరణ తరగతులు నిర్వహించాలని ఉపరాష్ట్రపతి సూచించారు. విశ్వవిద్యాలయ ర్యాంకింగ్ పెంపు, సమగ్ర విద్యార్థి అభివృద్ధి, అనుబంధ కళాశాలలపై క్రమమైన పర్యవేక్షణ, సమాజానికి ఉపయోగపడే పరిశోధన-ఆవిష్కరణలను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని కూడా ఆయన ప్రత్యేకంగా నొక్కి చెప్పారు.

# ఉన్నావ్‌లో డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు బోల్తా

**– 20 మందికి గాయాలు**



దేశంలో వరుసగా చోటుచేసుకుంటున్న బస్సు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కర్నూలు, చేవెళ్లలో ఇటీవల జరిగిన ఘోర ప్రమాదాలు మరువక ముందే, మరో పెద్ద బస్సు ప్రమాదం వెలుగులోకి వచ్చింది. ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో డబుల్ డెక్కర్ స్లీపర్ బస్సు అదుపు తప్పి బోల్తా పడింది, ఈ ఘటనలో సుమారు 20 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బుధవారం రాత్రి హసన్‌పూర్ ప్రాంతంలో ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వేపై ఈ ప్రమాదం జరిగింది. ఆగ్రా నుంచి లక్నో వెళ్తున్న బస్సులో 60 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రయాణ మధ్యలో బస్సు అదుపుతప్పి కూరగాయలుతో వెళ్తున్న పికప్ వాహనాన్ని ఢీకొట్టింది. దాని ప్రభావంతో బస్సు రోడ్డుకిపక్కకు బోల్తాపడినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బస్సు అతివేగంగా ప్రయాణిస్తున్నట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు అద్దాలను పగులగొట్టి లోపలి ప్రయాణికులను బయటకు తీసి రక్షించారు. గాయపడిన వారిని అంబులెన్స్‌లలో సమీప ఆసుపత్రులకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న ఇలాంటి రోడ్డు ప్రమాదాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఆన్‌లైన్ వేధింపులతో మనస్తాపానికి గురై వ్యక్తి మృతి

**మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో సోషల్ మీడియా ట్రోలింగ్, ఆన్‌లైన్ వేధింపులు విషాదానికి దారితీశాయి. బహిరంగ మూత్ర విసర్జన చేస్తున్న వీడియో వైరల్ కావడంతో తీవ్ర ఒత్తిడికి గురైన జాల్నా జిల్లా ధోక్‌మాల్ తండాకు చెందిన ఒక యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, యువకుడు తన స్నేహితుడితో కలిసి శంభాజీనగర్‌కు వెళ్లిన సమయంలో, 'ఛత్రపతి శంభాజీనగర్' అనే బోర్డు కింద ఇద్దరూ బహిరంగ మూత్ర విసర్జన చేశారు. అక్కడున్న వ్యక్తి వారిని మొబైల్‌లో రికార్డు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వీడియో వేగంగా వైరల్ కావడంతో, నెటిజన్లు తీవ్ర విమర్శలు, అసభ్యకర వ్యాఖ్యలు, బెదిరింపులు చేశారు. పరిస్థితి దిగజారడంతో ఇద్దరూ వీడియో ద్వారా ప్రజలకు క్షమాపణలు చెప్పినప్పటికీ, ఆన్‌లైన్ వేధింపులు ఆగలేదు. దీంతో తీవ్రమైన మనస్తాపానికి గురైన యువకుడు బావిలో దూకి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆన్‌లైన్ బుల్లీయింగ్, ట్రోలింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.**



# రూ.17 లక్షల రివార్డు ఉన్న మహిళా మావోయిస్టు కమలా సోడి లొంగుబాటు

**పునరావాసానికి పోలీసుల సాయం**

ఛత్తీస్‌గఢ్‌లో కొనసాగుతున్న యాంటీ నక్సల్ ఆపరేషన్ల ఫలితంగా మరో మహిళా మావోయిస్టు కమలా సోడి గురువారం అధికారుల ఎదుట లొంగిపోయింది. ఉంగి అలియాస్ 'తరుణ' పేరుతో మావోయిస్టుల్లో చురుకుగా పనిచేసిన కమలా సోడిపై రూ.17 లక్షల రివార్డు ఉండటం విశేషం. ఆమె లొంగుబాటును పోలీసులు ముఖ్య విజయంగా భావిస్తున్నారు.

రాజ్‌నంద్‌గావ్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ అభిషేక్ శాండిల్య, ఎస్పీ లక్ష్య శర్మ సహా ఉన్నతాధికారుల సమక్షంలో కమలా సోడి లొంగిపోయింది. ఆమె లొంగుబాటుతో మరిన్ని మహిళా మావోయిస్టులు ఆయుధాలు వదిలి ప్రధాన ప్రవాహంలోకి వస్తారన్న నమ్మకాన్ని పోలీసులు వ్యక్తం చేశారు. పునరావాస చర్యలలో భాగంగా కమలాకు తక్షణ సహాయంగా ₹50,000 నగదు సాయం అందజేశారు. సుక్మా జిల్లాలోని కుంట ప్రాంతానికి చెందిన కమలా సోడి, 2011 నుంచి సీపీఐ (మావోయిస్టు) దళాలతో అనుబంధం కలిగి ఉంది. మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జోన్ పరిధిలో జరిగిన నక్సల్ కార్యకలాపాల్లో ఆమె కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు తెలిపారు. మూడు రాష్ట్రాల్లో చోటుచేసుకున్న పలు దాడుల్లో కమలా చురుకుగా పాల్గొన్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. భద్రతా బలగాల కఠిన ఆపరేషన్లు, ప్రభుత్వ పునరావాస విధానాలు ఫలితంగా మావోయిస్టుల లొంగుబాట్లు ఇటీవలి కాలంలో పెరుగుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



# థాయ్‌లాండ్‌లో అక్రమంగా చేరిన 270 మంది భారతీయుల స్వదేశ ప్రయాణం

- **రాయల్ థాయ్ ప్రభుత్వ సహకారంతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేక విమానాలు**
- **సైబర్ మోసం కేంద్రాల్లో పనిచేసినట్లు ఆరోపణలు**

థాయ్‌లాండ్‌లోని మియావాడ్డీ (మయన్మార్ సరిహద్దు ప్రాంతం) నుంచి అక్రమంగా థాయ్ భూభాగంలోకి ప్రవేశించి అదుపులోకి తీసుకున్న 270 మంది భారతీయులను స్వదేశానికి తరలించారు. వీరిలో 26 మంది మహిళలు ఉన్నారు. బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం, చియాంగ్ మాయ్‌లోని భారత కాన్సులేట్ రాయల్ థాయ్ ప్రభుత్వంలోని పలు శాఖలతో సమన్వయం చేస్తూ, భారత వాయుసేన నడిపిన రెండు ప్రత్యేక విమానాల ద్వారా వీరి రిపాట్రియేషన్‌ను పూర్తి చేసింది.

ఈ భారతీయులు మయన్మార్‌లోని మియావాడ్డీ ప్రాంతం నుంచి థాయ్‌లాండ్‌లోకి అక్రమంగా ప్రవేశించినందుకు, థాయ్ వలస చట్టాలు ఉల్లంఘించిన ఆరోపణలపై స్థానిక అధికారులు వీరిని నిర్బంధించారు. వీరిలో పలువురు మయన్మార్‌లో ఉన్న సైబర్ స్కామ్ సెంటర్స్‌లో పనిచేసినట్లు సమాచారం లభించింది.

బ్యాంకాక్, చియాంగ్ మాయ్, న్యాయ సంబంధిత థాయ్ సంస్థలతో పాటు మయన్మార్‌లోని భారత రాయబార కార్యాలయం కూడా ఇంకా అక్కడే ఉన్న భారతీయుల స్వదేశ రప్పింపుపై చర్యలు కొనసాగిస్తోంది. భారత మిషన్లు రెండు దేశ ప్రభుత్వాలతో మాట్లాడి, శీఘ్ర రిపాట్రియేషన్ ప్రక్రియకు కృషి చేస్తున్నాయి.

విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్తున్న భారతీయులకు రాయబార కార్యాలయం కీలక సూచనలు జారీ చేసింది. విదేశీ కంపెనీలు, నియామక ఏజెంట్లు, ఉద్యోగ అవకాశాల నిజత్వం తప్పనిసరిగా పరిశీలించాలనీ, మోసపూరిత ఉద్యోగాలకు లోనవద్దని హెచ్చరించింది.

వీసాఫ్రీ సదుపాయం ఉన్న దేశాల్లో—ప్రత్యేకించి థాయ్‌లాండ్‌లో—ఈ వీసా మినహాయింపు సదుపాయం పర్యటనా లేదా స్వల్పకాలిక వ్యాపార ప్రయోజనాలకే పరిమితం అని, దీన్ని ఉద్యోగాల కోసం దుర్వినియోగం చేయరాదని భారత రాయబార కార్యాలయం స్పష్టం చేసింది.







# నీల్ మూవీ నుంచి తారక్ లుక్ వైరల్

అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబోలో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించి తాజాగా అప్డేట్ వచ్చింది. ఈ ప్రాజెక్ట్ తదుపరి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక ఫొటోను పంచుకుంది. ఈ ఫొటోలో ఎన్టీఆర్ కొత్త స్టైల్ కోసం హెయిర్ స్టైలిష్టతో పాటు దర్శకుడు ప్రశాంత్ నీల్ పర్యవేక్షించడం చూడవచ్చు. ఈ సినిమాలో ఎన్టీఆర్ రెండు విభిన్నమైన లుక్‌లలో కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ ప్రాజెక్‌ట్‌లో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. మలయాళ స్టార్ నటుడు బీజు మీనన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తుంది.






# స్విమ్‌సూట్ సీన్‌తో షారుఖ్ మూవీకి నో చెప్పిన రవీనా

స్విమ్‌సూట్ వేసుకోవడం ఇష్టం లేక అగ్ర నటుడు షారుఖ్ సినిమాను రిజెక్ట్ చేశానని తెలిపింది బాలీవుడ్ కథానాయిక రవీనా టాండన్. ఈ సినిమా విడుదలైన దాదాపు 32 ఏండ్ల తర్వాత తాజాగా ఈ ఘటనను పంచుకుంది ఈ భామ.షారుక్ ఖాన్ విలన్‌గా నటించిన 'డర్' సినిమాలో హీరోయిన్‌గా చేయమని చిత్రబృందం మొదట నన్నే సంప్రదించింది. అయితే ఈ సినిమాలో కొన్ని సన్నివేశాలు నన్ను అసౌకర్యానికి గురిచేశాయి. దీంతో ఈ ప్రాజెక్‌ట్‌ను రిజెక్ట్ చేశాను. చివరకు ఆ పాత్ర జూహీచావ్లాను వరించింది. నేను ఈ సినిమాను వదులుకోవడానికి కాస్ట్యూమ్స్ కూడా ఒక కారణం. అందులో కొన్ని సన్నివేశాలలో స్విమ్‌సూట్ ధరించాలని చెప్పారు. దానికి నేను అంగీకరించలేదు. అలా డర్ సినిమా అవకాశాన్ని నేను కొల్పోయాను అంటూ రవీనా చెప్పుకోచ్చింది. దిగ్గజ దర్శకుడు యష్ చోప్రా దర్శకత్వంలో వచ్చిన చిత్రం డర్. 1993లో వచ్చిన ఈ సినిమాలో సన్నిడియోల్ కథానాయకుడిగా నటించగా.. షారుఖ్ ఖాన్ విలన్‌గా నటించాడు. ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా షారుఖ్‌కి మంచి పేరు తెచ్చిపెట్టింది. ఫిల్మ్ ఫేర్ అవార్డులలో ఉత్తమ విలన్‌గా షారుఖ్ అవార్డును కూడా అందుకున్నాడు.

# తెగ ట్రెండ్ అవుతున్న రామ్ చరణ్ 'చికిరి' స్టెప్



మెగా అభిమానుల కోసం 'పెద్ది' మూవీ టీమ్ మాంచి మాస్ ట్రీట్ అందించింది. రామ్ చరణ్ హీరోగా వస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో తొలి పాట 'చికిరి' రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. నవంబర్ 7న ఈ సాంగ్ విడుదల కానుందని చిత్రబృందం అధికారికంగా వెల్లడించింది. పాట ప్రోమోను కూడా రిలీజ్ చేశారు. అందులో రామ్ చరణ్ వేసిన హుక్ స్టెప్ చూసి అభిమానులు పులకరించిపోయారు.. సింపుల్ అవుట్‌ఫిట్‌లో, షర్ట్, ప్యాంట్, మెడలో కర్చీఫ్ కట్టుకొని కొండ అంచున నిలబడి వేసిన స్టెప్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది.'చికిరి... చికిరి...' ట్యూన్ కంటే ఆ హుక్ స్టెప్‌లో చరణ్ చూపిన గ్రేస్, ఎనర్జీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అభిమానులు "బాసూ... చరణ్ డ్యాన్సులో ఏంటి ఆ గ్రేస్!" అంటూ సోషల్ మీడియాలో ఫుల్ జోష్‌లో రియాక్షన్లు ఇస్తున్నారు. ఈ స్టెప్‌ను చూసిన అభిమానులు ఊహాశక్తిని ఉపయోగించి, ఏఐ టెక్నాలజీ ద్వారా మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కూడా అదే హుక్ స్టెప్ వేస్తున్నట్లుగా ఒక వీడియో సృష్టించారు. ఆ వీడియో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది. ఇక సినిమా విషయానికి వస్తే..రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ భారీ చిత్రానికి 'ఉప్పెన' ఫేమ్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.సినిమాకు సంగీతం అందిస్తున్నది ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్. ఇందులో శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'పెద్ది' చిత్రం రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మార్చి 27, 2026న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. 'చికిరి' సాంగ్ రాబోతుండటంతో సోషల్ మీడియా ఇప్పటికే హీటెక్కింది చరణ్ మాస్ డ్యాన్స్ మళ్లీ రికార్డులు సృష్టించేలా ఉందనే అంచనాలు ఉన్నాయి!

# దుల్కర్ సల్మాన్ "కాంత' ట్రైలర్ విడుదల



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్, దగ్గుబాటి రానా మల్టీస్టారర్‌గా వస్తున్న చిత్రం 'కాంత'. ఈ సినిమాకు తమిళ దర్శకుడు సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తుండగా.. మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నాడు. స్పిరిట్ మీడియా, వేఫేరర్ ఫిల్మ్స్ పతాకాలపై రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 1950 మద్రాస్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం నవంబరు 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని ట్రైలర్‌ను విడుదల చేశారు.



# టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న మోనాలిసా..

కుంభమేళాలో పూసలు అమ్ముతూ సాధారణ జీవితం గడిపిన ఓ అమ్మాయి ఒక్కసారిగా సోషల్ మీడియాలో స్టార్‌గా మారింది. ఆమె పేరే మోనాలిసా. తేనెపట్టు వంటి కళ్లతో, చక్కని చిరునవ్వుతో, అమాయకమైన హావభావాలతో నెటిజన్ల హృదయాలను గెలుచుకుంది. మహాకుంభ్ మేళాలో పూసలు అమ్ముతుండగా ఆమె వీడియోలు వైరల్ కావడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. మధ్యప్రదేశ్‌కి చెందిన మోనాలిసా తన కుటుంబంతో కలిసి మహాకుంభ్ మేళాకు వెళ్లి పూసల దండలు అమ్ముతుండగా కొందరు వ్యక్తులు ఆమెను వీడియో తీయడంతో ఆ వీడియో నెట్టింట వైరల్ అయింది. ఆ క్షణం మోనాలిసా జీవితం మారిపోయింది. ఆమె అందం చూసి నెటిజన్లు ఫిదా అయ్యారు.వైరల్ అయిన కొద్ది రోజులకే బాలీవుడ్ దర్శకుడు సనోజ్ మిశ్రా మోనాలిసాను గుర్తించి తన సినిమాలో హీరోయిన్‌గా అవకాశం ఇచ్చారు. "ది డైరీ ఆఫ్ మణిపూర్" చిత్రంలో మోనాలిసా నటించి వెండితెరపై అరంగేట్రం చేసింది. చిన్న పాత్ర అయినా ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంది.తాజాగా మోనాలిసా తెలుగు సినిమా రంగంలోకి అడుగు పెట్టింది. ఆమె 'లైఫ్' అనే పాన్ ఇండియా చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. 'క్రష్', 'ఇట్స్ ఓకే గురు' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న హీరో చరణ్ సాయి సరసన నటిస్తోంది. 'లైఫ్' సినిమా పూజా కార్యక్రమం ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ చిత్రాన్ని శ్రీ వెంగమాంబ మూవీస్ బ్యానర్‌పై అంజయ్య విరిగినేని, ఉషా విరిగినేని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.కుంభమేళాలో పూసలు అమ్మిన అమ్మాయి ఇప్పుడు సినీ ఇండస్ట్రీలో స్టార్‌గా మారడం నిజంగా స్ఫూర్తిదాయకం. మోనాలిసా అందం, వినయంతోపాటు ఆమె జీవిత ప్రయాణం ఇప్పుడు యువతకు ఆదర్శంగా మారుతోంది.

# గాయని చిన్మయిపై అసభ్యకర వ్యాఖ్యలు..

**-సజ్జనార్‌కు ఫిర్యాదు చేసిన సింగర్**



ప్రముఖ సినీ గాయని చిన్మయి శ్రీపాద మరోసారి సోషల్ మీడియాలో ట్రోలింగ్ బారిన పడింది. సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు తనను, తన కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఆమె హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లింది. చిన్మయి చేసిన ఫిర్యాదు ప్రకారం... సోషల్ మీడియాలో కొంతమంది వ్యక్తులు చాటింగ్ ద్వారా తనను ఉద్దేశిస్తూ రాయడానికి వీలు లేని అసభ్య పదాలతో వేధిస్తున్నారు. తాను సాధారణంగా ట్రోలింగ్‌ను పట్టించుకోనప్పటికీ, ఈసారి ట్రోలర్స్ తన పిల్లలను కూడా ట్రోలింగ్‌లోకి లాగి, వారు చనిపోవాలని కోరుకుంటున్నట్లు వ్యాఖ్యానించడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ముఖ్యంగా, 'మంగళసూత్రం' ధరించడం గురించి తన భర్త, నటుడు రాహుల్ రవీంద్రన్ ఇటీవల చేసిన కామెంట్స్‌పై ఒక యువకుడు అసభ్యంగా ట్రోల్ చేయడాన్ని చిన్మయి పోలీసుల దృష్టికి తీసుకువచ్చారు.అయితే చిన్మయి ఫిర్యాదుపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ తక్షణమే స్పందించారు. ఈ విషయంపై వెంటనే స్పందించాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులతో పాటు హైదారాబాద్ పోలీసులను ఆదేశించాడు. సింగర్ చిన్మయి భర్త, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ ప్రస్తుతం తన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా ఇటీవల ఒక మీడియా ఇంటర్వ్యూలో 'మంగళసూత్రం' గురించి మాట్లాడుతూ, "మంగళసూత్రం ధరించాలా? వద్దా? అనేది పూర్తిగా తన భార్య చిన్మయి నిర్ణయం అని. ఆ విషయంలో ఆమెను తాను బలవంతం చేయను అని వ్యాఖ్యానించారు. అయితే రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర చర్చకు దారి తీశాయి. కొందరూ వ్యాఖ్యలపై రాహుల్‌కి మద్దతునిస్తుండగా.. మరికొందరూ.. హిందు ధర్మాన్ని కించపరుస్తున్నారంటూ చిన్మయిరాహుల్ దంపతులను టార్గెట్ చేసి విమర్శించడం మొదలుపెట్టారు. అయితే ఈ వివాదంలో చివరకు పిల్లల వరకు వెళ్లి ట్రోల్ చేయడంతో చిన్మయి పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చింది.

# 8 గంటల పని షిఫ్ట్..

## దీపికాకు మద్దతుగా నిలిచిన యామి గౌతమ్





బాలీవుడ్ నటి దీపికా పదుకొనే సినిమా షూటింగ్‌ల సమయంలో రోజుకు 8 గంటల పని షిఫ్ట్ కోరడంపై ఇండస్ట్రీలో పెద్ద చర్చ నడుస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఇప్పటికే పలు సినిమాలను కూడా వదులుకుంది ఈ భామ. అయితే ఈ వివాదంపై తాజాగా నటి యామి గౌతమ్ స్పందిస్తూ దీపికాకు మద్దతు తెలిపింది. షూటింగ్‌లో టైం లిమిట్ అనేది.. నటుల అవసరాలు, నిర్మాణ పరిస్థితులను బట్టి మారుతుందని ఆమె స్పష్టం చేసింది. సినిమా షూటింగ్‌లో సమయ పరిమితి అనేది నటులకి, దర్శకుడికి, నిర్మాతకు మధ్య ఉండే పరస్పర అవగాహనపై ఆధారపడి ఉంటుంది. ఇది పూర్తిగా వ్యక్తిగతమైన నిర్ణయం. ఇతర రంగాల్లో ఉన్నట్లుగా మన సినీ పరిశ్రమ కొంచెం భిన్నంగా ఉంటుంది. లొకేషన్లు, పర్మిషన్లు, ఇతర నటీనటులు, టెక్నీషియన్లతో సమన్వయం... ఇలా చాలా అంశాలు ఉంటాయి. అందుకే ఇక్కడ సమయపాలన విషయంలో పక్కా నిబంధనలు పెట్టడం కష్టం. కొంతమంది నటీనటులు ఎన్నో ఏళ్లుగా రోజుకు 8 గంటలు, వారానికి 5 రోజులు మాత్రమే పనిచేస్తున్నారు. ఇది కొత్తగా వచ్చిన డిమాండ్ కాదు. నటులు, నిర్మాతలు ముందుగానే మాట్లాడుకొని దీనిని నిర్ణయించుకుంటారు. ఒక మహిళా నటి ఈ డిమాండ్ చేస్తేనే అది పెద్ద వివాదంలా ఎందుకు మారుతోందో అర్థం కావడం లేదు. నటులు తమ పని గంటల గురించి అడగడంలో ఎలాంటి తప్పు లేదు. షూటింగ్‌కి అది అనుకూలంగా ఉంటే ముందుకు వెళ్లవచ్చు. లేకపోతే లేదంటూ యామి చెప్పుకోచ్చింది.తల్లి అయిన తర్వాత దీపికా పదుకొనే కేవలం 8 గంటల పని షిఫ్ట్‌ను డిమాండ్ చేయడంతోనే ఆమెకు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహించాల్సిన 'స్పిరిట్' (ప్రభాస్ సరసన) సినిమా నుంచి తప్పుకోవాల్సి వచ్చిందని వార్తలు వచ్చాయి. దీంతో వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ అంశంపై బాలీవుడ్‌లో పెద్ద చర్చ మొదలైంది. దీపికా డిమాండ్‌ను పలువురు బాలీవుడ్ నటులతో పాటు టాలీవుడ్ నటులు కూడా సమర్థించగా తాజాగా యామి గౌతమ్ కూడా మద్దతును ప్రకటించింది.

# నాన్‌వెజ్‌కు దూరం..

## మహావతార్ కోసం డైరెక్టర్ రూట్‌లో విక్కీకౌశల్..!

బాలీవుడ్ స్టార్ యాక్టర్ విక్కీ కౌశల్ నటిస్తున్న ప్రాజెక్టుల్లో ఒకటి మహావతార్. అమర్ కౌశిక్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో లార్డ్ పరశురామ పాత్రలో కనిపించబోతున్నాడు విక్కీ కౌశల్. చాలా రోజుల క్రితం విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ గూస్ బంప్స్ తెప్పిస్తూ సినిమాపై అందరిలో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంటెన్స్ యాక్షన్, డ్రామాతో వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకుల్ని ఈ సినిమా ఆకట్టుకుంటుందని విక్కీ కౌశల్ ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశాడు.ఈ మూవీని వచ్చే ఏడాది స్పెషల్ పూజా సెర్మనీతో మొదలు పెట్టేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. కాగా ఈ సినిమా కోసం డైరెక్టర్ అమర్ కౌశిక్, హీరో విక్కీ కౌశల్ నాన్ వెజ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. తాజా కథనాల ప్రకారం అమర్ కౌశిక్ ఇప్పటికే తన డైట్ ప్లాన్‌లో మార్పులు చేసుకున్నాడు. మరోవైపు విక్కీ కౌశల్ ప్రస్తుతం నటిస్తున్న లవ్ అండ్ వార్ పూర్తి చేసిన తర్వాత అమర్ కౌశిక్ రూట్‌లోనే వెళ్లనున్నాడట.లార్డ్ పరశురామ పాత్రకున్న శక్తివంతమైన దైవత్వాన్ని దృష్టిలో పెట్టుకొని విక్కీ కౌశల్ నాన్ వెజ్‌ను పక్కన పెట్టాలని డిసైడ్ అయ్యాడని ఇన్‌సైడ్ టాక్. అరుణాచల్ ప్రదేశ్‌లోని పరశురాం కుండ్‌కు సమీపంలో పెరిగిన అమర్ కౌశిక్.. మహావతార్ తన హృదయానికి చాలా దగ్గరైన ప్రాజెక్ట్ అని ఇప్పటికే క్లారిటీ ఇచ్చాడు. మహావతార్‌ను ముందుగా 2026 క్రిస్మస్ సందర్భంగా విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించగా.. తాజా అప్‌డేట్‌తో ఈ మూవీ 2027లో విడుదల కావొచ్చని అర్థమవుతోంది.





తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# జగద్గిరిగుట్ట హత్య కేసులో వేగవంతమైన విచారణ

## నిందితుల అరెస్టు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జగద్గిరిగుట్ట బస్టాప్ వద్ద నవంబర్ 05న జరిగిన దారుణ హత్య కేసును సైబరాబాద్ పోలీసులు వేగంగా ఛేదించారు. జగద్గిరిగుట్ట పోలీసులు, బాలానగర్ ఎస్‌ఓటీ బృందం సంయుక్తంగా పని చేసి, కేసులో ప్రమేయం ఉన్న నిందితులను స్విఫ్ట్‌గా గుర్తించి అరెస్టు చేశారు. పగలు పూట రద్దీ ప్రదేశంలో జరిగిన ఈ హత్య నగరవాసుల్లో ఆందోళన రేకెత్తించింది. సంఘటన సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలను సేకరించి సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించారు. తక్కువ సమయంలోనే నిందితుల జాడను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించినట్లు పోలీసులు వెల్లడించారు. సైబరాబాద్ పోలీసుల ఈ వేగవంతమైన వ్యవస్థాపక స్పందనపై స్థానిక ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. కేసు సంబంధిత మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నట్లు అధికారులు తెలిపారు.









# అదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రి పరిస్థితులు ఆందోళనకరం: కవిత

- స్వచ్ఛత, సిబ్బంది కొరత
- తక్షణ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్
- కార్డియాక్ కేసులు పెరుగుతుండటంతో రెసిడెంట్ కార్డియాలజిస్ట్ నియామకం కీలకం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అదిలాబాద్‌లోని రిమ్స్ (రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రి పరిస్థితులు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రిమ్స్‌ను సందర్శించి రోగులు, వైద్యులు, అధ్యాపకులు, మెడికల్ విద్యార్థులతో సమావేశమై వారి సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం చేసిన పరిశీలనలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆస్పత్రిలో మూల సదుపాయాల లోపం కొనసాగుతుండటం, రోగులకు సరైన వైద్య సేవలు అందడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సందర్శన సందర్భంగా కవిత పలువురు రోగులను పరామర్శించి, వారితో ఆరోగ్య సేవల లభ్యత, ఔషధాల అందుబాటు, ఆహార నాణ్యత, శానిటేషన్ పరిస్థితులపై మాట్లాడారు. ఆస్పత్రి పరిశుభ్రత పరంగా సరైన చర్యలు జరగకపోవడం, టాయిలెట్స్, వార్డులు పాడైపోవడం, బెడ్‌షీట్లు, శుభ్రత సామగ్రి కొరత కారణంగా రోగులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఐసీయూ, అత్యవసర విభాగాల్లో సిబ్బంది తగినంతగా లేక పని భారం పెరిగిందని వైద్యులు తమ సమస్యలను ఆమెకు వివరించినట్లు తెలిపింది.

అదిలాబాద్ జిల్లాలో గుండెపోటు, హృదయ సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని రిమ్స్‌లో రెసిడెంట్ కార్డియాలజిస్ట్‌ను తక్షణమే నియమించాలని కవిత డిమాండ్ చేశారు. స్పెషలిస్ట్ వైద్యుల కొరత వల్ల కీలక సందర్భాల్లో చికిత్స ఆలస్యమవుతోందని, ఇది పల్లె, గిరిజన ప్రాంతాలకు పెద్ద ప్రమాదమని వ్యాఖ్యానించారు. రిమ్స్ వంటి ప్రధాన ప్రభుత్వ వైద్య సంస్థలో మెరుగైన పరికరాలు, నిపుణులైన వైద్య సిబ్బంది, సకాలంలో చికిత్స అందుబాటులో ఉండాలని ఆమె హితవు పలికారు. ప్రతి పౌరునికి నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వం యొక్క రాజ్యాంగ బద్ధ బాధ్యత అని కవిత గుర్తుచేశారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, శానిటేషన్, డాక్టర్ల నియామకం, టెక్నికల్ సిబ్బంది పెంపు, పరికరాల అప్‌గ్రేడేషన్ వంటి అంశాలను అత్యవసర ప్రాధాన్యంతో చేపట్టాలని ఆమె కోరారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంలో నిర్లక్ష్యం అసహ్యం అని, సమర్థవంతమైన ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# వరద ముప్పు నుంచి కాపాడిన హైడ్రాకు ప్రజల కృతజ్ఞతల వెల్లువ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నగరంలో వరద ముప్పు నుంచి అనేక కాలనీలను తప్పించిన హైడ్రా వ్యవస్థకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. అమీర్‌పేట, శ్రీనివాస్‌నగర్, గాయత్రీనగర్, కృష్ణనగర్, అంబేద్కర్‌నగర్ ప్రాంతాల నివాసితులు ర్యాలీలు నిర్వహించి హైడ్రా అధికారులకు అభినందనలు తెలిపారు. మైత్రివనం వద్ద ప్లకార్డులు ప్రదర్శించి, వరదలతో అతలాకుతలమైన తమ కాలనీలను రక్షించినందుకు హైడ్రాను కొనియాడారు. అంటే 5 సెంటీమీటర్ల వర్షం పడ్డా నీట మునిగిపోయే అమీర్‌పేట ప్రాంతం, ఇప్పుడు 15 సెంటీమీటర్ల భారీ వర్షానికి కూడా నీరు నిలవకుండా మారిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. భూగర్భ పైపులైన్లలో పేరుకున్న పూడికను హైడ్రా పూర్తిగా తొలగించడంతో సమస్య సర్వం సిద్ధెందని తెలిపారు. అంబేద్కర్‌నగర్‌లో డ్రైనేజీ రోడ్లపై పారే సమస్య కూడా హైడ్రా జోక్యంతో పరిష్కారమైందని నివాసితులు పేర్కొన్నారు.




హైడ్రా వ్యవస్థ ప్రవేశపెట్టడంలో, సమస్య పరిష్కారంపై పర్యవేక్షణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారని ప్రజలు అభినందించారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ పలు మార్లు పరిశీలించి చర్యలు తీసుకోవడం వల్లే ఈ ఫలితం సాధ్యమైందని వారు అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉంటే, ప్యాట్నీ నాలా విస్తరణతో ఏడెనిమిది పైకాలనీలకు వరద ముప్పు తొలగింది. పాయిగా కాలనీ, ప్యాట్నీ కాలనీ, విమాన నగర్, బీహెచ్‌ఈఎల్ కాలనీ, ఇందిరమ్మ నగర్ తదితర ప్రాంతాల ప్రజలు ర్యాలీగా వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ప్యాట్నీ వద్ద 70 అడుగుల నాలా 15-18 అడుగులకు కుంచించుకుపోవడంతో దశాబ్దాల సమస్య తలెత్తిందని, హైడ్రా చర్యలతో మళ్లీ అసలు వెడల్పుకు విస్తరించడంతో సమస్య శాశ్వత పరిష్కారమైందని పేర్కొన్నారు.

30 ఏళ్లుగా వర్షం పడితే వాహనాలు, ఇళ్ల సామాన్లు మునిగిపోయి భారీ నష్టాలు వచ్చేవని నివాసితులు గుర్తు చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే హైడ్రా స్పందించి పరిష్కారం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

# ఆస్ట్రేలియా పై భారత్ విజయం

ఆస్ట్రేలియా పర్యటనలో వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు పొట్టి సిరీస్‌లో ముందంజ వేసింది. కీలకమైన నాలుగో టీ20లో సమిష్టి ప్రదర్శనతో ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది. శుభ్‌మన్ గిల్ (46) సాధికారిక ఇన్నింగ్స్‌కు అక్షర్ పటేల్(21 నాటౌట్ 220) ఆల్‌రౌండ్ షో తోడవ్వగా ఆసీస్‌ను 48 పరుగుల తేడాతో మట్టికరిపించింది. లక్ష్య ఛేదనలో ఆరంభం నుంచి తడబడిన కంగారూ టీమ్.. సుందర్ (33) విజృంభణతో 119కే ఆలౌటయ్యింది. భారీ విజయాన్ని అందుకున్న టీమిండియా ఐదు టీ20ల సిరీస్‌లో 21తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. పేస్, బౌన్సీ పిచ్‌లతో ప్రత్యర్థులను బోల్తా కొట్టించే ఆస్ట్రేలియాను స్పిన్ అస్త్రంతో దెబ్బ కొట్టింది భారత జట్టు. సిరీస్‌లో కీలకమైన నాలుగో టీ20లో భారీ స్కోర్‌తో కంగారూలకు పరీక్ష పెట్టిన టీమిండియా.. ఆ తర్వాత బంతితో చెలరేగింది. టాపార్డర్ శుభారంభం ఇచ్చినా.. మిడిల్ ఓవర్లలో స్పిన్నర్లు అక్షర్ పటేల్(220), వాషింగ్టన్ సుందర్(33)లు తిప్పేయగా ఆతిథ్య జట్టు బ్యాటర్లు వరుసగా డగౌట్ చేరారు. పవర్ హిట్టర్ స్టోయినిస్(17)ను సుందర్ ఎల్బీగా వెనక్కి పంపగా ఆసీస్ ఓటమి ఖాయమైంది. భారత్ నిర్దేశించిన 168 పరుగుల భారీ ఛేదనలో ఆస్ట్రేలియాకు ఆదిలోనే అక్షర్ పటేల్ షాకిచ్చాడు.

దంచికొడుతున్న
డేంజరస్ ఓపెనర్ మాథ్యూ షార్ట్(25)ను ఎల్బీగా వెనక్కి పంపాడు. దాంతో..




పరుగులు వద్ద ఆతిథ్య జట్టు తొలి వికెట్ కోల్పోయింది. మొదట అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో రివ్యూ తీసకొని టీమిండియా అతడి వికెట్ సాధించింది. ఆతర్వాత వచ్చిన జోష్ ఇంగ్లిస్(10) బుమ్రా ఓవర్లో రెండు బౌండరీలు బాదాడు. దాంతో.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆసీస్ 48 పరుగులు చేసింది. ఆ తర్వాతి ఓవర్లోనే ఇంగ్లిస్ అక్షర్ పటేల్ ఓవర్లో బౌల్డ్ కాగా.. దూకుడుగా ఆడుతున్న కంగారూ కెప్టెన్ మిచెల్ మార్ష్(30)ను దూబే ఔట్ చేసి పెద్ద బ్రేకిచ్చాడు. అతడి ఓవర్లో పెద్ద షాట్ ఆడిన మార్ష్ బౌండరీ వద్ద అర్ష్‌దీప్ సూపర్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. 70కే మూడు వికెట్లు పడిన వేళ టిమ్ డేవిడ్(14), ఫిలిప్పే(10)లు జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, వీరిద్దరూ స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. డేంజర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్(2)ను వరుణ్ బౌల్డ్ చేసి మ్యాచ్‌ను టీమిండియా వైపు తిప్పాడు. సుందర్ ఓకే ఓవర్లో స్టోయినిస్(17)ను ఎల్బీగా.. బార్ట్‌లెట్‌ను రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. బుమ్రా ఒక వికెట్ తీయగా.. సుందర్ ఓవర్లో జంపా గిల్ చేతికి చిక్కగా కంగరూ టీమ్ 119కే ఆలౌటయ్యింది. 48 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్ సిరీస్‌లో 21తో ముందంజ వేసింది.

గిల్, అక్షర్ పోరాడగా..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు శుభారంభం లభించినా సద్వినియోగం చేసుకోలేదు. మిడిలార్డర్ చేతులెత్తేగా టీమిండియా నిర్ణీత ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 167 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(28) స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగినా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్(46) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఫామ్ లేమితో తంటాలు పడుతున్న గిల్.. ఎట్టకేలకు క్రీజులో నిలిచి జట్టును ఆదుకున్నాడు. మిడిలార్డర్‌లో శివం దూబే(22), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(20)లు ఫర్వాలేదనిపించారు. ఆఖర్లో అక్షర్ పటేల్(21 నాటౌట్) ధనాధన్ ఆడడంతో టీమిండియా పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది.

# మంధానకు రికార్డు ధర..

## -వరల్డ్ కప్ స్టార్లకు షాకిచ్చిన ఫ్రాంచైజీలు..!

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం భారత క్రికెటర్లను ఫ్రాంచైజీలు భారీ ధరకు రీటైన్ చేసుకున్నాయి. విశ్వ విజేతగా అవతరించిన టీమిండియాలోని సభ్యులైన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్(, రీచా ఘోష్‌ల బ్యాండు వాల్యూ పెరగడమే కాదు రీటైన్ ధర కూడా కోట్లకు చేరింది. స్వదేశంలో ముగిసిన వరల్డ్ కప్‌లో చెలరేగి ఆడిన మంధానను రూ.3.50 కోట్ల రికార్డు ధరకు ఆర్సీబీ రీటైన్ చేసుకుంది. వరల్డ్ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా ఎంపికైన దీప్తి శర్మను యూపీ వారియర్స్ వదిలేసింది. ఆశ్చర్యమేమిటంటే.. ముంబై ఇండియన్స్ తమ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(రూ.2.2 కోట్లు)ను కాదని నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.50కోట్లు)కు పెద్ద మొత్తం కట్టబెట్టింది. నవంబర్ 27న మెగా వేలం జరుగనున్న నేపథ్యంలో ఏ ఫ్రాంచైజీ వద్ద ఎంత సొమ్ము ఉంది? ఎవరెవరు వేలంలోకి వస్తున్నారు? అనేది చూద్దామా.మహిళా క్రికెట్‌కు కొత్త హంగులు తెచ్చిన డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌కు ముందే ఆసక్తి రేపుతోంది. వేలంపాటకు సమయం దగ్గరపడడంతో బుధవారం ఫ్రాంచైజీలు రీటైన్ ప్లేయర్ల జాబితాను వెల్లడించాయి. ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ గరిష్టంగా ఐదుగురిని రీటైన్ చేసుకోగా.. గత మూడు సీజన్లలో ప్లే ఆఫ్స్ చేరలేకపోయిన యూపీ వారియర్స్ మాత్రం ఒక్కరినే అట్టిపెట్టుకుంది. జట్టులోని స్టార్ ప్లేయర్లు దీప్తి శర్మ, అలీసా హేలీతో పాటు ప్రపంచ కప్‌లో చెలరేగిన పేసర్ క్రాంతి గౌడ్‌ను సైతం వద్దనుకుంది. శ్వేతా షెరావత్‌ను మాత్రమే రీటైన్ చేసుకున్న యూపీ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్, ఆసీస్ ఆల్‌రౌండర్ గ్రేస్ హ్యారీస్‌లను సైతం వదిలేసింది.




**జెమీమాకు 2.2కోట్లు**

వరల్డ్ కప్ సెమీ ఫైనల్లో ఆస్ట్రేలియాపై అజేయ శతకంతో భారత్‌ను గెలిపించిన జెమీమా రోడ్రిగ్స్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ అట్టిపెట్టుకుంది. ఫైనల్లో బ్యాటుతో, బంతితో రాణించిన ఓపెనర్ షఫాలీ వర్మతో పాటు జెమీమాను రూ.2.2కోట్లకు ఢిల్లీ అట్టిపెట్టుకుంది. ప్రపంచకప్‌లో అదరగొట్టిన దక్షిణాఫ్రికా పేసర్ మరిజానే కాప్, ఆస్ట్రేలియా పేసర్ అనాబెల్ సథర్‌లాండ్‌లను సైతం రూ.2.2కోట్లకే రీటైన్ చేసుకుంది రెండుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ మాత్రం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను రూ.2.5కోట్లకే కొనసాగించింది. కానీ, ఇంగ్లండ్ నాయకి, ఆల్‌రౌండర్ నాట్ సీవర్ బ్రంట్‌కు ఏకంగా రికార్డు స్థాయిలో రూ.3.50కోట్లు ముట్టజెప్పింది. అలానే.. వరల్డ్ కప్‌లో మెరిసిన అమన్‌జోత కౌర్ సైతం కోటి కొల్లగొట్టింది. విధ్వంసక ఓపెనర్ హేలీ మాథ్యూస్‌ను ముంబై రూ.1.7కోట్లకు అట్టిపెట్టుకుంది.రెండో సీజన్ ఛాంపియన్ అయిన ఆర్సీబీ స్టార్ ప్లేయర్లను అట్టిపెట్టుకుంది. మంధానకు రూ.3.50కోట్లు, వరల్డ్ కప్‌లో ఫినిషర్‌గా దంచేసిన రీచా ఘోష్‌కు 2.75కోట్లు ఖరారు చేసింది. ఆసీస్ ఆల్‌రౌండర్ ఎలీసా పెర్రీని రూ.2 కోట్లకు రీటైన్ చేసుకున్న ఆర్సీబీ.. ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్‌ను రూ.60 లక్షలకు కొనసాగించింది. మరోవైపు గుజరాత్ జెయింట్స్ అష్ గార్డ్‌నర్(రూ.3.5కోట్లు), బేత్ మూనీ(రూ.2.5కోట్లు)లను మాత్రమే అట్టిపెట్టుకుంది. వరల్డ్ కప్‌లో 571 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచినా లారా వొల్వార్డ్‌త్‌ను సైతం గుజరాత్ వదిలేసింది.

ముంబై ఇండియన్స్ : నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు). ప్రస్తుతం ముంబై పర్స్‌లో 5.75 కోట్లు ఉన్నాయంతే.

ఢిల్లీ క్యాపిటల్స్ : జెమీమా రోడ్రిగ్స్,( రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్(రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్(రూ.50 లక్షలు). ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు ఉన్నాయి.

యూపీ వారియర్స్ : శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు). పర్స్‌లో 14.5 కోట్లు ఉన్నాయి.

**ఆర్సీబీ** : స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్(రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్(రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది. పర్స్‌లో 6.15 కోట్లు ఉన్నాయి.

**గుజరాత్ జెయింట్స్** : బేత్ మూనీ(రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు). పర్స్‌లో రూ.9 కోట్లు ఉన్నాయి.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in